# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక 24 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | జూలై 23, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

మనసు బాధపెట్టు మాటలు విన్నచో
మౌనముద్ర దాల్చు మరచిపోకు
కర్మఫలములన్ని కాలమ్ము సరిజూచు
శాంతముగను నీవు సాగుమయ్య

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.


### ఓటరు జాబితాలో పేరు లేకపోతే

# ప్రభుత్వ పథకాలు రావు

## కొడంగల్‌లో 78 శాతం మాత్రమే ఎస్ఐఆర్‌లో నమోదు



హైదరాబాద్ :బీజేపీ, బీఆర్ఎస్‌లు చేసిన తప్పులను ప్రశ్నిస్తున్నందుకే తనపై కుట్ర చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ రెండు పార్టీలు వేరు కావొచ్చు కానీ, వాళ్ల లక్ష్యం మాత్రం ఒక్కటేనని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ఓటరు జాబితా సమగ్ర సవరణపై బీఎల్ఏలతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు.ఓట్లు తొలగిద్దామని చూస్తున్నారు : ప్రతి పేదవాడికి మంచి చేసేందుకు కృషి చేస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి, ఈక్రమంలో రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవట్లేదన్నారు. కొడంగల్‌లో నేరుగా ఎదుర్కోలేక తనను దెబ్బతీసేందుకు కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన వాళ్ల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో దెబ్బతీస్తే రాష్ట్ర స్థాయికి రాలేడు అని ఆలోచిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 90 శాతం కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తారని, వారి ఓట్లు తొలగిద్దామని చూస్తున్నారని ఆరోపించారు. కొడంగల్‌లో 78 శాతం మంది సర్ ప్రక్రియలో పాల్గొన్నారని తెలిపారు. మిగిలిన 22 శాతం ఓట్లు నమోదు చేయించాలని అధికారులకు సూచించారు.'సర్‌లో కేవలం మైనార్టీల ఓట్లే తొలగిస్తున్నారనే ఒక అపోహ ఉంది. బీజేపీ, బీఆర్?ఎస్? వాళ్లు కలిసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్లు తొలగిస్తున్నారు. ఎందుకంటే ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు 90 శాతం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తరు, లెక్క గట్టి గంప గుత్తగా తీసి ఈ ఓట్లను బయట పడేసి రేవంత్ రెడ్డి సంగతి చెప్పొచ్చని అనుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలని బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటై పేదల ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నాయి. ఎందుకంటే ఇక్కడ బీజేపీ ఉన్నది లేదు, ఊడేది లేదు. బీజేపీ, బీఆర్?ఎస్? ఒక్కటై మనతో కొట్లాడలని వాళ్ల కుట్ర. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వాళ్లే బీజేపీకి ఓట్లు వేయించారు. వీటిన్నింటిని తిప్పి కొట్టాలంటే గ్రామంలో ఉన్న వారి వల్లనే అవుతుంది" –రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఆధారాలు చూపి నమోదు చేసుకోండి : ఓటర్లతో బీఎల్ఏలు ఎస్ఐఆర్ తప్పకుండా నమోదు చేయించాలన్న సీఎం, ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావని చెప్పారు. గతంతో పోలిస్తే సరైన వివరాలు లేకపోతే పక్కన పెడతారన్న ఆయన అనుమానాస్పదంగా ఉంటే సరైన ఆధారాలు చూపి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే వారి జాబితా ఇప్పుడే నిర్ణయం అవుతోందని, కొడంగల్ నియోజకవర్గంలో అర్హులైన వారి ఓట్లు తొలగించేందుకు వీల్లేదని తేల్చి చెప్పారు.

### రాహుల్‌గాంధీ, విపక్షనేతల అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్

# చలో లోక్‌భవన్



హైదరాబాద్ : దిల్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "చలో లోక్‌భవన్" ర్యాలీ స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు చేపట్టిన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో పోలీసులు మధ్యలోనే అడ్డుకుని కాంగ్రెస్ ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేసి లోక్‌భవన్ పరిసరాలను పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.దిల్లీలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతల అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం కాంగ్రెస్ ర్యాలీని దృష్టిలో ఉంచుకుని నెక్లెస్ రోడ్డు నుంచి లోక్‌భవన్ వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో మొదలైన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో ప్రధాన కూడలి వద్దే పోలీసులు అడ్డుకున్నారు.ముందే మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు ర్యాలీని నిలిపివేశారు. పోలీసుల అడ్డుకట్టను దాటేందుకు కొందరు కార్యకర్తలు ప్రయత్నించడంతో స్వల్పంగా ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అప్పటికే మోహరించిన పోలీసు బలగాలకు అదనంగా పంజాగుట్ట పోలీసు స్టేషన్ నుంచి సిబ్బందిని, మహిళా కానిస్టేబుళ్లను రప్పించి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

### అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి

# తొలగిపోకూడదు



హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ ఐఆర్ ) కార్యక్రమాల పర్యవేక్షణ కమిటీతో బుధవారం నందినగర్‌లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ ఆధ్వర్యంలోని కమిటీ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కేటీఆర్‌కు వివరించింది. అనంతరం కమిటీకి ఆయన పలు కీలక సూచనలు చేశారు.

రాష్ట్రంలో లక్షల మంది ఓటర్ల పూర్తి వివరాలు అందుబాటులో లేకపోవడంతో వారిలో చాలామందిని నోటీసులు జారీ చేసే విభాగంలో చేర్చారని కేటీఆర్ పేర్కొన్నారు. అలాంటి ఓటర్లకు నోటీసులు అందిన వెంటనే పార్టీ శ్రేణులు వారికి అవసరమైన మార్గనిర్దేశం చేసి, అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటరు కూడా మిస్ కాకూడదని, అదే సమయంలో డూప్లికేట్ లేదా అనర్హ ఓటర్లు జాబితాలో ఉండకుండా చూడాలని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆగస్టు 3వ తేదీ వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమంలో నిమగ్నం కావాలని సూచించారు.ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత అసలు పని ప్రారంభమవుతుందని పేర్కొన్న కేటీఆర్, జాబితాలో పేర్లు ఉన్నవారు, లేనివారిని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. డూప్లికేట్ ఓటర్ల తొలగింపు, అర్హులైన వారి పేర్ల నమోదు కోసం క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టినియోజకవర్గ ఇంచార్జీలు, సభ్యత్వ ఇంచార్జీలు, జనరల్ సెక్రటరీలు, కోఆర్డినేటర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉండేలా, అనర్హులు లేదా డూప్లికేట్ ఓటర్లు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు.

### విద్యార్థులు, రాహుల్‌కు మద్దతుగా ప్రతి రోజు నిరసనలు



సంగారెడ్డి, జులై 22: మూడో సారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. బుధవారం సంగారెడ్డిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా ఢిల్లీలో నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ వేలాది మంది యువత ఆందోళన బాట పట్టారని చెప్పారు. ఆందోళనకు దిగిన వారిని దారుణంగా రక్తం వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ నివాసాన్ని ముట్టడిస్తే.. ఆయన్ని కూడా అరెస్ట్ చేశారని అన్నారు.

### దేశ వ్యవస్థ అక్రమాలకు అడ్డాగా మారింది- ఈ దశాబ్దంలో

# 152 పరీక్షల పత్రాలు లీక్

◆ నీట్ అంశం, ప్రతిపక్షాల ఆందోళనలపై కాంగ్రెస్ ఎంపీ సమావేశం



ఢిల్లీ : ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా పేరుగాంచిన మన దేశ విద్యా వ్యవస్థ, నేడు అక్రమాలకు నిలయంగా మారిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్? గాంధీ ధ్వజమెత్తారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. అలాగే దశాబ్ద కాలంలో 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని, 7.50 కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎంత నష్టపోయినా, ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదని మండిపడ్డారు. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని, డిమాండ్లు పరిష్కరించాలని మాత్రమే యువత కోరుతోందని తెలిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. లాఠీఛార్జ్‌లో విద్యార్థులు గాయపడడం సహా వారి ఆక్రందనకు సంబంధించిన దృశ్యాలను మీడియాకు ప్రదర్శించారు."గత పదేళ్లలో 152 సార్లు ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు జరిగాయి, కానీ ఒక్కరికి కూడా శిక్ష పడలేదు. అంటే ఎవరో ఒకరు లేదా ఒక బృందం మన విద్యా వ్యవస్థను, అంటే దేశపు అత్యంత విలువైన ఆస్తిని నాశనం చేసి, మన విద్యార్థుల జీవితాలను దెబ్బతీశారు. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది? శిక్షలు మాత్రం పడడంలేదు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే. అలాగే, దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ మొత్తం వ్యవహారంపై ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి. పరీక్షల విధానంలో మార్పులు తీసుకురావాలి. నిరసనలో జరిగిన గాయాల గురించి బాధపడటం లేదు, ఇంకా ఎన్ని దెబ్బలకైనా సిద్ధం. కానీ, విద్యార్థులకు జరుగుతున్న నష్టం విషయంలోనే బాధ కలుగుతోంది. అందుకే విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నాం. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేస్తున్నారు, జలఫిరంగులు వాడుతున్నారు. ఆందోళన చేసేవాళ్లు, ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తులు కాదు. విద్యార్థులంటే మన దేశ భవిష్యత్, మన ఆశలు."

### భోగాపురం ఎయిర్‌పోర్ట్

# ప్రారంభోత్సవానికి రండి



న్యూఢిల్లీ, జులై 22: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం.చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు.ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. 'అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు.ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.

### లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదు. దేశాన్ని దోచుకుంటుంటే

# చూస్తూ ఊరుకోం



వికారాబాద్, జులై 22: అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. (బుధవారం) కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను ఆ పార్టీ నాయకులు అమ్ముకుని.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడం లేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు.ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు.

### బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత..

# రామచందర్ రావు అరెస్ట్



హైదరాబాద్, జులై 22 : గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట నిన్న (మంగళవారం) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవ న్ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది.ఇక, కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నేతలను అడ్డుకునే క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

## అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మోడీ, ట్రంప్ దిష్టిబొమ్మల దహనం



**ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఖానాపూర్ మండల రంగాపేట గ్రామంలోని కొత్తగూడెంలో ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని సంఘం డిమాండ్ చేసింది. అమెరికా వ్యవసాయ ఉత్ప త్తులపై సుంకాలను ఎత్తివేస్తే దేశీయ రైతాంగం తీవ్రంగా దెబ్బతింటుందని, పత్తి, మొక్కజొన్న, వరి, పసుపు, సోయాబీన్, వంటనూనెలు, యాపిల్స్, పాల ఉత్పత్తుల ధరలు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.రైతులకు కనీస మద్దతు ధరలు అమలు చేయాలని, అన్ని పంటలకు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. ఒప్పందాన్ని వెనక్కి తీసుకోకపోతే దేశవ్యాప్తంగా ఉద్య మాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ ఆర్. ఉపాలి, సహాయ కార్యదర్శి గోగు శేఖర్, కమిటీ సభ్యులు గుట్ల ప్రసాద్, గోనే స్వామి, రైతు లు అత్రం గణేష్, సోయం గంగారం, కనుక చంద్రకళ, నైతం లింగుబాయి, నర్సపల్లి గంగవ్వ, మాదాసు బుచ్చవ్వ, గూట్ల లక్ష్మి, సుశీల, నల్లపు రాజవ్వ, సీడం గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ



**ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని బీర్‌నంది ఉన్నత పాఠశాలను ఎంపీడీవో రాధా రాథోడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహ ణను పరిశీలించి వర్షాకాలంలో పరిశుభ్రమైన నీరు, వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతిరోజు పాఠశాలకు హాజరై 100శాతం ఉత్తీర్ణత సాధించాలని మోటివేషన్ ఇచ్చారు. తనిఖీ అనంతరం ఎంపీడీవో రాధా రాథోడ్‌కు శాలువా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు జి.ఎల్.వి. ప్రసాద్, కొల్లంగూడ సర్పంచ్ అర్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సుంకాల ఎత్తివేత పై నిరసన



**ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమెరికాతో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను ఎత్తివేస్తే దేశీయ రైతాంగం తీవ్రంగా దెబ్బతింటుందని, పత్తి, మొక్కజొన్న, వరి, పసుపు, సోయాబీన్, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు కనీస మద్దతు ధరలు అమలు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఎల్నినో, డెంగ్యూ జ్వరాల పై అవగాహన సదస్సు



**ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ సంస్కృతిక కళాకారుల ఆధ్వర్యంలో ఖానాపూర్ గ్రామపం చాయతీలో ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల్లో పంటల సాగు, డెంగ్యూ జ్వరాల నివారణ, మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలని సూచించగా, విద్యార్థులు, గ్రామ పెద్దలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల మల్లేష్, ఉప సర్పంచ్ ఓరగంటి రాజేశ్వర్, బిఎల్ఓ సత్యవ్వ, ఆశా వర్కర్ కమల, ప్రధానోపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాదం కుర్తి గ్రామంలో పుష్కర ఘాటు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



**ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాదం కుర్తి గ్రామం వద్ద ఘాటు నిర్మించాలని గ్రామ నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడుమా బొజ్జు పటేల్‌ను ఉట్నూర్ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పి ంచారు.ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. పుష్కర ఘాటు నిర్మాణం వలన మస్కాపూర్, సుర్జాపూర్, మేడంపల్లి, చింతల్‌పేట్, గంగాయిపేట్ తదితర గ్రామాల భక్తులకు సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్షపు శ్రీనివాస్, ఉప సర్పంచ్ మాదాసు నవీన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాసుల లక్ష్మీరాజ్యం, వి.డి.సి సభ్యులు మురళి, కమ్మల రాజు, బండి లింగ గౌడ్, మైలారపు ఎల్లయ్య పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



**హుస్నాబాద్ నియోజకవర్గం, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిగురుమామిడి గ్రామంలోని 5వ వార్డు (దళితవాడ)లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు దొంత కర్ణకర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిరంతరం కృషి చేసిన ఫలితంగా ఈ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని--శివప్రసాద్ సహకారంతో 5వ వార్డు ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు.గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

# భగత్‌నగర్లో దోపిడీకి గురైన బాధితులను పరామర్శించిన డిప్యూటీ మేయర్



**కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిన్న రాత్రి కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో దొంగలు ఒక ఇంట్లో చొరబడి కుటుంబ సభ్యులను బంధించి దోపిడీకి పాల్పడ్డారు. ఇంట్లో ముగ్గురు మహిళలు, ఒక వృద్ధుడు మాత్రమే ఉన్న సమయంలో దొంగలు రెచ్చిపోయి వారిని భయాందోళనలకు గురి చేశారు. మహిళ నోట్లో గుడ్డలు కుక్కి, బీరువాలు పగలగొట్టి బంగారం, నగదును అపహరించారు. బాధితుల వివరాల ప్రకారం సుమారు 50 తులాల బంగారం, రూ.20 లక్షల నగదు దోచుకెళ్లారు. ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు బుధవారం బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భయాన్ని పోగొట్టి భద్రతా భావాన్ని కలిగించడం పోలీసుల బాధ్యత అని పేర్కొన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా తీవ్రంగా స్పందించి కరీంనగర్ సీపీతో మాట్లాడి నిందితులను వెంటనే పట్టుకునేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీ స్వయంగా ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసుపై లోతైన విచారణ ప్రారంభించారు. పోలీసులు ఇప్పటికే సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ, నిందితుల భాష, ప్రవర్తన ఆధారంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారా లేక స్థానికులతో సంబంధాలున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.రాబోయే రోజుల్లోనే కేసును ఛేదించి బాధితులకు న్యాయం చేస్తారని పోలీసులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాంపల్లి రేణుక-శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి బండి సంజయ్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి యత్నం



**కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ స్థానిక కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడి యత్నం చేసిన ఘటనపై బీజేపీ నేతలు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం 12:15 గంటల సమయంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు సుమారు 50 మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎంపీ కార్యాలయంలోకి అక్రమంగా చొరబడి సిబ్బందిపై దాడి యత్నం చేసి, అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని బీజేపీ నేతలు ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి ప్రాణహాని కలిగించేలా ప్రవర్తించారని, అక్కడికి చేరుకున్న పోలీసులను కూడా అడ్డుకున్నారని పేర్కొన్నారు.ఈ ఘటనపై మేయర్ కొలగాని శ్రీనివాస్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు, ఎన్నం ప్రకాష్, కో-ఆప్షన్ సభ్యులు, బీజేపీ నాయకులు పోలీస్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.పోలీస్ కమిషనర్ కార్యాలయం ఈ ఫిర్యాదును స్వీకరించి ఘటనపై విచారణ ప్రారంభించింది.

# ఫైర్ ఎన్‌ఓసీపై అగ్నిమాపక అధికారికి ఏఐఎఫ్‌బీ వినతి



**కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రైవేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు కలిగి ఉన్నప్పుడే ఫైర్ఎన్ఓసీ మంజూరు చేయాలని, రెన్యూవల్ చేయాలని అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. నేషనల్ బిల్డింగ్ కోడ్, తెలంగాణ అగ్నిమాపక చట్టం ప్రకారం స్ప్రింక్లర్లు, అలారాలు, అండర్‌గ్రౌండ్ వాటర్ ట్యాంకులు, అత్యవసర ద్వారాలు ఉన్న భవనాలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఫిర్యాదుపై స్పందించిన అధికారి, భద్రతా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు లోబడి ఉన్న సంస్థలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.బండారి శేఖర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో అనేక ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలలు కనీస భద్రతా ప్రమాణాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ఇటువంటి భవనాలు ప్రజల ప్రాణాలకు ముప్పు అని హెచ్చరిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేస్తే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ ఆగ్రహ నిరసనలు




**కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ, నీట్ పేపర్ లీకేజీపై కేంద్రాన్ని నిలదీస్తూ కరీంనగర్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహ నిరసనలు చేపట్టాయి.నగరంలోని గాంధీ చౌక్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి కాంగ్రెస్ నేతలు నిరసన దీక్ష ప్రారంభించారు. డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నీట్ పరీక్షలో ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని డిమాండ్ చేశారు.వ ానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులపై ఢిల్లీలో జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్ష నాయకులపై జరిగిన అరెస్టులు ప్రజాస్వామ్యంపై దాడి అని పేర్కొన్నారు. తరువాత గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీపై నినాదాలు చేయడంతో పోలీసులు కాంగ్రెస్ నేతలను అడ్డుకున్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు అరెస్టు కాగా, కొందరికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.ఈ నిరసనలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారా యణ, కోమటిరెడ్డి నరేం దర్ రెడ్డి, అంజన్ కుమార్, ఆకుల నరసయ్యతో పాటు కాంగ్రెస్ పా ర్టీకి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం అమానుషం

**- రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం:**
**- నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకుడు యేకుల సురేష్.**



**దేవరకొండ జూలై 22.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** దేశ రాజధాని ఢిల్లీలో తమ భవిష్యత్తు కోసం, న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అమాయక విద్యార్థులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసులతో అమానుషంగా లాఠీఛార్జ్ చేయించి, బాష్పవాయు గోళాలు (టియర్ గ్యాస్) ప్రయోగించి దారుణంగా దాడి చేయించడాన్ని నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులు యేకుల సురేష్ తీవ్రంగా ఖండించారు.
దేశ యువత, విద్యార్థులు తమ సమస్యలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్లను పక్కన పెట్టి దౌర్జన్యానికి దిగడం బీజేపీ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. విద్యార్థుల పక్షాన నిలబడి, వారిపై జరిగిన అమానుష దాడికి బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రితో పాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలంతా వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వీరోచితంగా పోరాటం చేసిన జననాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పలువురు ఎంపీలు మరియు ఎమ్మెల్యేలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు.
ఈ సందర్భంగా యేకుల సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ రౌడీ రాజ్యం నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు, బాధితులకు ఎక్కడ అన్యాయం జరిగినా వారి వెన్నుతట్టి, తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడే ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దాడి జరిగిన మరుక్షణమే రాహుల్ గాంధీ రహదారిపైకి వచ్చి విద్యార్థులకు అండగా నిలవడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి భయపడుతున్న బీజేపీ ప్రభుత్వం, రాజ్యాంగ విరుద్ధంగా అరెస్టులకు పాల్పడుతూ ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ధ్వజమెత్తారు.
శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగ బద్ధమైన హక్కును కాలరాస్తూ, విద్యార్థులపై బాష్పవాయు గోళాలు విసిరి రౌడీల్లా విరుచుకుపడటం హేయమైన చర్య అని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా, ఎంతటి అణచివేత చర్యలకు పాల్పడినా రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులు, యువత హక్కుల కోసం చేసే పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. బీజేపీ నియంతృత్వ వైఖరిపై దేశవ్యాప్తంగా ప్రజలు, యువత తిరగబడాలని, రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో ఈ బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని యేకుల సురేష్ హెచ్చరించారు.

# ఎల్‌నినో సమీక్ష సమావేశం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కె. హైమావతి




**హుస్నాబాద్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ ఐఓసీలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరగనున్న వాన కాలం ఎల్‌నినో సమీక్ష సమావేశ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం పరిశీలించారు. మూడు జిల్లాల కలెక్టర్లు, ఏడు మండలాల అధికారులు హాజరయ్యే ఈ సమావేశానికి ప్రొజెక్టర్, సీటింగ్, మైక్ సెట్టింగ్, భోజన సౌకర్యాలు, నిరంతర విద్యుత్ వంటి ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ రామ్మూర్తిని ఆమె ఆదేశించారు. తరువాత కలెక్టర్ హుస్నాబాద్ 20వ వార్డులోని రైతు బజార్ భవనంలో శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల తాత్కాలిక వసతి గృహాన్ని పరిశీలించారు. శాశ్వత భవనం పూర్తయ్యే వరకు తాగునీరు, మరుగుదొడ్లు, భోజన వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈనెల 24న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన యుఎస్ఎఫ్ఐ



**కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నీట్ పేపర్ లీకేజ్ నిరసనలో భాగంగా ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24న విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి సంద గణేష్ తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిందని ఆయన విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే పదవి నుండి తొలగించాలని, ఎన్‌టిఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లాఠీచార్జ్‌లో అసాంఘిక శక్తులు చేరి విద్యార్థులపై దాడి చేసిన విషయంపై తక్షణ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ పేపర్ లీకేజ్ బాధ్యులను కఠినంగా శిక్షించాలని, దీక్ష చేస్తున్న విద్యార్థులతో ప్రభుత్వం చర్చలు జరపాలని ఆయన సూచించారు. లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 24న జరగనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని, అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

# మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బర్తరఫ్ చేయాలని ఎఐవైఎఫ్ డిమాండ్



**కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్, బాష్పవాయువు ప్రయోగాన్ని ఖండిస్తూ ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు పోలోజు రంజిత్, బ్రాహ్మణపల్లి యుగేందర్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా బలహీనపడిందని, ధర్మేంద్ర ప్రధాన్ అవినీతి కారణంగా ఎన్‌టిఏ అసమర్థంగా మారి విద్యార్థులకు శాపంగా మారిందని విమర్శించారు. నీట్, యూజీసీ నెట్ వంటి పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, మూల్యాంకన వివాదాలు విద్యార్థుల కఠోర శ్రమను వృథా చేశాయని పేర్కొన్నారు. విద్యార్థుల శాంతియుత నిరసనలను అణచివేయడం దుర్మార్గమని, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు మండిపడ్డారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని తొలగించి, ఎన్‌టిఏను రద్దు చేయాలని, లేని పక్షంలో యువత తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ మంత్రి పొన్నం ధర్నా



**హుస్నాబాద్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మంత్రి పొన్నం ప్రభాకర్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, హోంమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లాఠీచార్జ్‌లో గాయపడిన విద్యార్థులకు వైద్యం అందించడంతో పాటు, ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు వంద మంది ఎంపీలు శాంతియుత నిరసన చేస్తున్న సమయంలో అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఆయన విమర్శించారు. విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడి గాంధేయవాద సత్యాగ్రహాన్ని తలపించిందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించేది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. ఈ ధర్నాలో అన్ని మండలాల అధ్యక్షులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి




**– కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను శాశ్వతంగా నివారించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలోని ప్రధాన రహదారులపై లైటింగ్ వ్యవస్థను మెరుగుపరచాలని, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలు తొలగించి, స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్‌లు ఉపయోగించక పోవడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ఉల్లంఘనలకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రవాణా శాఖ, ఆర్టీసీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం



**కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ విద్యాసంస్థలు, దుకాణాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయని, ఫిర్యాదు వస్తే వెంటనే స్పందిస్తున్నామని తెలిపారు. డీఈవో చైతన్య జైనీ పాఠశాలల్లో మాదకద్రవ్యాల నిరోధక క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్సైజ్ సూపరింటెంట్ నాగేశ్వరరావు, డీడబ్ల్యూఓ సరస్వతి కూడా అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఖండిస్తూ బీజేపీ మహాధర్నా



**హుస్నాబాద్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి చేసిన ప్రయత్నాన్ని ఖండిస్తూ హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా జరిగింది. పోలీసులు బీజేపీ శ్రేణులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రధాని మోదీపై వ్యక్తిగత దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ప్రజల మద్దతు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధి కోసం అశాంతి సృష్టిస్తోందని విమర్శించారు. బీజేపీ ఎల్లప్పుడూ రాజ్యాంగబద్ధమైన విధానాలను పరిరక్షిస్తుందని, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న అంచక రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని ఆయన పేర్కొన్నారు. ఈ మహాధర్నాలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమారస్వామి, కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు నునవత్ మోహన్ నాయక్, రాష్ట్ర నాయకులు లక్కిరెడ్డి తిరుమల, తోట స్వరూప, కుంట స్వప్న, జనగామ వేణుగోపాల్ రావు, కర్ణకంటి నరేష్‌తో పాటు మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతల స్వీకరించిన అన్నేడి భాస్కర్ రెడ్డి



**సుల్తానాబాద్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుద్దాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) నూతన చైర్మన్‌గా అన్నేడి భాస్కర్ రెడ్డి బుధవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామ పెద్దలు, సహకార సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన చైర్మన్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సంఘం సీఈఓ సతీశ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నేడి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, ఎరువులు, విత్తనాలు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచులు, సహకార సంఘ పాలకవర్గ సభ్యులు, రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. రైతులు కొత్త పాలకవర్గం ఆధ్వర్యంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని భూలక్ష్మి దేవికి శుద్ధి కార్యక్రమం



**సుల్తానాబాద్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సుల్తానాబాద్ మున్సిపాలిటీ 3వ వార్డులో భూలక్ష్మి దేవికి ప్రత్యేక శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కందునూరి సమతా కుమార్ ఆధ్వర్యంలో పవిత్ర జలాలతో అభిషేకం చేసి, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మహిళలు, పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రజల సుఖసంతోషాల కోసం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం భక్తిపూర్వక వాతావరణంలో జరిగింది.

# దుబ్బపల్లి సమీపంలో బస్సు లారీ ఢీ



**సుల్తానాబాద్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ప్రైవేటు బస్సు, లారీ ఢీకొన్నాయి. ప్రమాదంలో బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతినగా, లారీకి కూడా నష్టం వాటిల్లింది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## సమయపాలన పాటించని ఆర్టీసీ సిబ్బంది ఆగ్రహంలో ప్రజలు



**ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం ఖానాపూర్‌లో ఒకే బస్సుకు అధిక సంఖ్యలో మహిళలు చేరడంతో రద్దీగా మారింది. ప్రయాణికులు మాట్లాడుతూ సమయపాలన పాటించని ఆర్టీసీ సిబంది కారణంగా ప్రతిరోజూ ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉద్యోగాలు, విద్య, వైద్య అవసరాల కోసం ప్రయాణించే మహిళలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. సకాలంలో బస్సులు నడపాలని, ప్రయాణికుల సౌకర్యం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసులను సమయానికి అందించడం అత్యవసరమని ప్రయాణికులు అభిప్రాయపడ్డారు.

# షీ టీమ్ అవగాహన సదస్సు



**పెద్దపల్లి, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం సీపీ ఆదేశాల మేరకు షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో అప్పన్నపేట జడ్పీహెచ్ఎస్ లో ఉపాధ్యాయుల ట్రైనింగ్ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎలా ఉండాలి, ఫోక్సో యాక్ట్, సోషల్ మీడియా ప్రభావం, విద్యార్థుల ప్రవర్తన నియమావళి గురించి వివరించారు. మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వేధింపులకు గురైతే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700నంబర్‌కు ఫోన్ చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్లకు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టరు పురుషోత్తం, రిసోర్స్ పర్సన్ జ్యోతి, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను తరగతిలో అమలు చేయాలి



**ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలని మండల విద్యాధికారి సంధ్యారాణి సూచించారు. బుధవారం బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆమె ప్రసంగించారు. గత నాలుగు సంవత్సరాలుగా విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరవేయాలని సంకల్పించిందని, రిసోర్స్ పర్సన్లు చెప్పిన విషయాలను బోధనలో ప్రతిబింబించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు డి. నరసయ్య, వాజిద్, సి. సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 25ను సవరించాలని ఉపాధ్యాయుల నిరసన



**రామడుగు, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రాథమిక పాఠశాలల్లో శాపంగా మారిన జీవో నెంబర్ 25ను సవరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పిఆర్సిని తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగ భద్రత లేని సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. రామడుగు, కొత్తపల్లి మండలాల్లో జరిగిన ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్‌లో భాగంగా ఎస్‌జిటియు రాష్ట్ర పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం మండల విద్యాధికారులు రంగనాథ్ శర్మ, ఆనందం వారికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఉకంటి విజేందర్ రెడ్డి మాట్లాడుతూ జీవో నెంబర్ 25ను సవరించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి, మూడు సంవత్సరాలుగా నిలిచిపోయిన పిఆర్సిని అమలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిటియు ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు పి. తిరుపతి రావు, పిఆర్టియు నాయకులు చాడ శ్రీనివాస రెడ్డి, గౌసిద్దం పరుశరామ్, టీటియు నాయకులు వెంకటేశ్వర్లు, రవీందర్, ఎస్టియు నాయకులు వెంకటస్వామి, మాధవ్, టిపిటిఎఫ్ నాయకులు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో వైభవంగా వరుణయాగం



**హుస్నాబాద్ నియోజకవర్గం, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాకతీయుల కాలం నాటి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక యజ్ఞయాగాలు నిర్వహించారు. 108 కలశాలతో అభిషేకాలు చేసి, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని ప్రార్థించారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో అన్ని దేవాలయాల్లో వరుణయాగాలు, పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయని, హైదరాబాద్ ఇంచార్జిగా బోనాల సందర్భంగా అమ్మవారిని ప్రార్థిస్తూ మంచి వర్షాలు పడాలని పూజలు చేస్తున్నామని తెలిపారు. కొత్తకొండ ఆలయం కాకతీయుల కాలం నాటి మహిమగల దేవాలయమని, ఇక్కడ జరిగే యజ్ఞయాగాలు ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# దుర్గాభవాని అమ్మవారికి చామగడ్డల మాలల అలంకరణ



కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగునూరులోని శ్రీ దుర్గాభవాని ఆలయంలో ఆషాడమాస శాకాంబరి ఉత్సవాల ఎనిమిదవ రోజు ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని చామగడ్డల మాలలతో అలంకరించి, మహిళలు వివిధ వంటకాలతో నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు, విశేష హారతులు నిర్వహించారు. మహిళలు అమ్మవారి సన్నిధిలో సౌందర్యలహారి పారాయణం చేసి చీరె సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# తపస్ మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



గంగాధర, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ఉద్యమ కార్యాచరణలో భాగంగా గంగాధర మండలంలో మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. మండల విద్యాధికారి డాక్టర్ ఎలిగేటి మల్లికార్జు, హెచ్ఎం జి. అనిత కుమారి చేత పోస్టర్ ఆవిష్కరించబడింది. ఆగస్టు 1న హైదరాబాద్‌లో జరగనున్న "తపస్ ఛలో హైదరాబాద్" మహా ధర్నాలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు బోయిన శ్రీకాంత్ మాట్లాడుతూ పిఆర్సిని 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని, 2003 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. సంపత్ రెడ్డి, లక్ష్మణ్, ఓ. పిరఘురాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీ వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు



కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మాజీ ఎంపీ, స్మార్ట్ సిటీ ప్రదాత బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా జరిగాయి. స్థానిక మార్కెట్‌లోని వెంకటేశ్వర ఆలయంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ రావు హాజరై, వినోద్ కుమార్ కరీంనగర్ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినోద్ కుమార్ కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా మార్చడంలో కీలక పాత్ర పోషించారని, ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత స్థానాల్లో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, వల రమణారావు, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అజిత్ రావు, సదానంద చారి, జమీలుద్దీన్, గడ్డం ప్రశాంత్ రెడ్డి, గంగాధర చందు, సాయి కృష్ణతో పాటు అనేక మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూసేకరణ పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్, ఫోర్‌లైన్ రహదారి, మానేరు రివర్‌ఫ్రంట్ వంటి కీలక అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని, ఎంజాయ్‌మెంట్ సర్వేలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వివాదాలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఆర్డీవో షర్మిలతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శాతవాహన ఇంజినీరింగ్ విద్యార్థుల

## వసతి ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



హుస్నాబాద్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ పట్టణంలోని 20వ వార్డులో రైతు బజార్ భవనంలో శాతవాహన ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల తాత్కాలిక వసతి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం పరిశీలించారు. శాశ్వత కళాశాల భవనం పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఇక్కడే వసతి కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, భోజన సౌకర్యం వంటి మౌలిక వసతులను సమగ్రంగా పరిశీలించి, కళాశాల యాజమాన్యంతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కిరాణా దుకాణంలో చోరీ....



ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బాదం కుర్తి గ్రామంలోని శివాజీ విగ్రహం చౌరస్తాలో గల కిరాణా దుకాణంలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. దుకాణానికి తాళాలు వేసినప్పటికీ పగులగొట్టి లోపలికి ప్రవేశించి వస్తువులు, నగదు దోచుకెళ్లారు. దుకాణ యజమాని షేక్ బాషా తెలిపిన వివరాల ప్రకారం దాదాపు రూ.4 వేల విలువైన వస్తువులు, రూ.300 నగదు పోయాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# మహిళా పోలీస్ స్టేషన్ వెయిటింగ్ హాల్, మున్సిపల్ జేసీబీ ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్ ఆవరణలో రూ.29 లక్షల నిధులతో నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో రూ.43 లక్షలతో కొనుగోలు చేసిన జేసీబీ వాహనాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, మహిళా పోలీస్ స్టేషన్‌కు జిల్లా వ్యాప్తంగా బాధితులు పెద్ద సంఖ్యలో వస్తారని, వారికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించేందుకు వెయిటింగ్ హాల్ నిర్మించామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను దశల వారీగా చేపడతామని, రాబోయే రోజుల్లో ఆసుపత్రి, బస్సు డిపో, కోర్టు, బైపాస్ రోడ్డు పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. మున్సిపల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులు జరుగుతు న్నాయని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్, పోలీస్ అధికా రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షునిగా అరవింద్ నాయక్



ఇబ్రహింపట్నం, జూలై 22 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్) : యాచారం మండలం సర్పంచ్ ఫోరం మండల కార్యవర్గాన్ని బుధవారం మేడిపల్లి గ్రామంలో నిర్వహించారు. యాచారం సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షునిగా మంతన్ గౌరెల్లి గ్రామ సర్పంచ్ అధ్యక్షునిగా కొర్ర అరవింద్ నాయక్ ను , సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులుగా 1.నీలం శ్రీవిద్య (కురుమిద్ద),2. అంబోజి రమేష్ (తులేకుర్ద్), ప్రధాన కార్యదర్శిగా దేరంగుల శంకర్,(మల్కీజ్ గూడ) గౌరవ ఆధ్యక్షులుగా.. ముచ్చర్ల సుగుణ సంపత్, (నకర్త మేడిపల్లి) , కార్యద ర్శులుగా బోడ కృష్ణ (సింగారం), కిషన్ నాయక్ (నల్లవెల్లి) , కోశాధికారిగా రమేష్ నాయక్ (కేసీ తండా), సహాయ కార్యదర్శిగా తొట్ట రమేష్ (చింతపట్ల), కార్యవర్గ సభ్యు లుగా.. అనిత శరణం (యాచారం), ఝాన్సీ రమేష్ (తాడిపత్రి) చైతన్య రాజు (నానక్ నగర్), వెన్నెల శేఖర్ (కొత్తపల్లి) ఈ ఎన్నిక కార్యక్రమంలో నందివపర్తి సర్పంచ్ విజయ కుమార్, సర్పంచ్లు బెల్లీ అశోక్ ,నక్క అలివేలు వెంకటేష్, రాజు, మంగా జంగయ్య, కౌసల్య జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై దాడి దారుణం

**- మీసాల వర్షిత్**

**- జంతర్ మంతర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్వీ నాయకుడు**




ఆమనగల్లు, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యను బీఆర్ఎస్వీ నాయకుడు మీసాల వర్షిత్ తీవ్రంగా ఖండించారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులకు తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తపరచే హక్కు రాజ్యాంగం కల్పించిందని, అలాంటి పరిస్థితుల్లో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. "విద్యార్థులు ఉగ్రవాదులపై బాంబులతో దాడి చేశారా? విద్యార్థులపై ఇంతటి దాడి ఎందుకు?" అంటూ కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జంతర్ మంతర్ ఘటనపై సంబంధిత అధికారులు నిష్పాక్షికంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ విద్యార్థుల హక్కులను గౌరవించాలని మీసాల వర్షిత్ కోరారు.

# 24న ఆమనగల్లులో ఎక్సైజ్ శాఖ భారీ వాహనాల వేలం




**- వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల విక్రయం..**

**- ఆసక్తి గల వారు పాల్గొనాలని సీఐ బద్యనాథ్ చౌహాన్ పిలుపు**

ఆమనగల్లు, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, ఆమనగల్లు పరిధిలోని నాలుగు మండలాల్లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు ఈ నెల 24వ తేదీ శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బద్యనాథ్ చౌహాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో వేలం పాట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.5,000 ధరావత్తు (ఈఎండీ) చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నాలుగు మండలాల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనల కోసం ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ కోరారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ ధ్యేయం



కాల్వ శ్రీరాంపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి అన్నారు. కేజీబీవీ పాఠశాలలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సంఘంలో సభ్యత్వం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల అమలు ప్రక్రియకు పీఆర్టీయూ పూర్తి సహకారం అందిస్తుందని, రెండు నెలల్లో పీఆర్సీ సాధనకు కృషి చేస్తుందని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు సీపీఎస్ రద్దు దిశగా కూడా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనలో పీఆర్టీయూ ఎల్లప్పుడూ ముందుంటుందని, సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముంజల హరికృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి కదారి నవీన్, మోడల్ స్కూల్ రాష్ట్ర అధ్యక్షుడు అనుముల పోచయ్య, కేజీబీవీ ఎస్ఓ శ్రీదేవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రమేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి అభినందనలు



తిమ్మాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రేణికుంట గ్రామానికి చెందిన బొంగాని రాజు--మంజుల కుమార్తె బొంగాని చరిష్మా ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల గ్రామ సర్పంచ్ ఎలుక అంజనేయులు అభినందనలు తెలిపారు. ఆమె కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఫలితంగా ఈ విజయాన్ని సాధించిందని, ఇది గ్రామం మొత్తం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ఈ విజయాన్ని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సర్పంచ్ సూచించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం, ప్రజల తరపున ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొని విద్యార్థినిని ఘనంగా సన్మానించారు.

# రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం అధికారుల నిర్లక్ష్యం



గన్నేరువరం, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మైలారం గ్రామం నుండి గన్నేరువరం మండల కేంద్రానికి వెళ్లే రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి స్తంభాన్ని తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ ప్రకటించిన డా. విక్రాంత్ ఠాకూర్




కరీంనగర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రముఖ న్యూరాలజిస్ట్ డా. విక్రాంత్ సింగ్ ఠాకూర్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. 100 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.10 లక్షల స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు ప్రకటించారు. కరీంనగర్‌లోని టైమ్ న్యూరోకేర్ హాస్పిటల్ ద్వారా అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్న ఆయన, స్ట్రోక్ చికిత్సలో థ్రాంబోలిసిస్ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఆరోగ్య చైతన్యం పెంచుతూ, రోగనిరోధక జీవనశైలిపై మార్గనిర్దేశం చేస్తున్నారు. తాను కూడా పేద కుటుంబం నుంచి వచ్చి ఈ స్థాయికి చేరానని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడటానికే ఈ సాయం చేస్తున్నానని డా. విక్రాంత్ తెలిపారు. ఆయన సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు.

# ఎమ్మెల్యే విజయరమణ రావు ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీని ఖండిస్తూ రాస్తారోకో



పెద్దపల్లి, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నీట్ పరీక్షల పేపర్ లీకేజీ, రాహుల్ గాంధీ--ప్రియాంక గాంధీ అరెస్టులపై పెద్దపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహ నిరసనలు చేపట్టాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, వరుస పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని, నీట్ లీక్ కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని అన్నారు. బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టులు అప్రజాస్వామికమని, విద్యార్థులపై లాఠీచార్జీలు మోడీ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో మున్సిపల్ చైర్మన్లు నూగిల్ల మల్లన్న, బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ చైర్మన్లు మినుపాల ప్రకాష్ రావు, కూర మల్లా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడిగా కారిగం ప్రవీణ్ కుమార్ ఎన్నిక



ఖానాపూర్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నిర్మల్ జిల్లా ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల ఫోరం ఎన్నికలు జిల్లా కేంద్రంలోని జమె రాత్పేట్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా షేక్ షబ్బీర్ అలీ, అధ్యక్షుడిగా కారిగం ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సామ దేవేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా చంద్రశేఖర్, గట్టు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా గంగాచరణ్, ఉమలు, కార్యదర్శులుగా రోహిదాస్, జలజ, కోశాధికారిగా భూమన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సమస్యలపై చర్చించి, ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్లకు గెజిటెడ్ హోదా ఇవ్వాలని, పాఠశాలల సముదాయ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలని, జివో 25ను ఉపసంహరించాలని తీర్మానాలు ఆమోదించారు. జిల్లాలో కార్యవర్గం ఏర్పడడం ఇదే మొదటిసారి.

## నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలను ఖండిస్తూ దిష్టిబొమ్మ దహనం





అమ్రాబాద్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, రాహుల్ గాంధీ అరెస్టు ఘటనపై అచ్చంపేటలో కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహ నిరసనలు చేపట్టారు. డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో ధర్నా నిర్వహించి, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, పేపర్ లీకేజీలతో లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని, విద్యార్థులపై లాఠీచార్జీలు, రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు జరిపించాలని, బాధ్యులపై క ఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, పట్టణ కాం గ్రె స్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ నిలిపివేత



కరీంనగర్, జూలై 22--23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జూలై 23న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు గోదాం గడ్డ 11 కె.వి. ఫీడర్‌లో దెబ్బతిన్న పోల్ ఎరెక్షన్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది. సప్తగిరి హిల్స్ రోడ్ నంబర్లు 1 నుంచి 4 వరకు, తాహెరా మసీదు పరిసరాలు, సంతోషి మాత ఆలయం, శ్రీనగర్, భవానీ, మల్లికార్జున కాలనీలు, జానకి వీధి అపార్ట్‌మెంట్లలో సరఫరా నిలిచిపోతుంది. అదేవిధంగా టౌన్-8 సెక్షన్‌లో లైన్ మరమ్మత్తు పనుల కారణంగా షాషా మహల్, లక్ష్మీనగర్, కోతి రాంపూర్, గాయత్రీ నగర్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ నిలిపివేయబడనుంది. జూలై 23న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కొత్తపల్లి (హెచ్)లోని 11 కె.వి. టౌన్ ఫీడర్‌పై పీఎంఐ పనులు జరగనున్నాయి. అలాగే ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ముకరంపుర, కలెక్టరేట్ కార్యాలయం, బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు, నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

## వరుణుడి కరుణతో కళకళలాడుతున్న పొలాలు

**- జోరందుకున్న ఖరీఫ్ సాగు పనులు**
**- వరి నాట్లతో బిజీగా అన్నదాతలు.. మంచి దిగుబడులపై ఆశలు**





ఆమనగల్లు, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మండల వ్యాప్తంగా గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సమృద్ధిగా వర్షపాతం నమోదవడంతో వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఏర్పడి ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. వరి నాట్లు వేగంగా సాగుతుండగా, మొక్కజొన్న, పత్తి, కంది, పెసర తదితర పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. పలు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే రైతులు కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లో పనులు చేపడుతున్నారు. పొలాలు నీటితో నిండిపోవడంతో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు నీటితో కళకళలాడుతుండటంతో భూగర్భ జలమట్టం కూడా పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడిందని రైతులు చెబుతున్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో మంచి దిగుబడులు వస్తాయనే ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది. వర్షాలు ఇలాగే కొనసాగితే వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి, నాణ్యమైన విత్తనాలు, సమతుల్య ఎరువులు వినియోగించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

## ఆదర్శనగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభం

**- భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



అచ్చంపేట, జూలై 22(నీలగిరి ఎక్స్‌ప్రెస్): అచ్చంపేట పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ బుధవారం భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేందుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితమల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు చింతల రాజగోపాల్, టౌన్ అధ్యక్షులు ఖాదర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



ఇబ్రహీంపట్నం , జూలై 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్) : నీట్ పేపర్ లీకుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, విద్యార్థుల భవిష్యత్ కోసం నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ తో చర్చలు జరిపి దీక్షను విరమింపచేసేలాగా ప్రభుత్వ చర్యలు ఉండాలని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. నీట్ పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ ఢిల్లీలో ప్రధాని నివాసం ముందు ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ దాడి నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సాగర్ హైవేపై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రాస్తారోకో, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, నీట్ వివాదంపై కేంద్రమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి అవమానమని విమర్శించారు. నీట్ పరీక్ష అక్రమాలపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసుల చర్యలను ఖండించారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు బాలశివుడు గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు మహమ్మద్ గౌస్, మున్సిపల్ కౌన్సిలర్లు నీళ్ల భాను గౌడ్, దారు రాఘవేంద్రరావు, ఎన్ ఎస్ యు ఐ నియోజవర్గ అధ్యక్షులు నందకిషోర్, అయాన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో రాహుల్ గాంధీ గొంతు నొక్కలేరు

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
**- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**





ఆమనగల్లు, జూలై 22: అక్రమ అరెస్టులతో భారతదేశ ప్రజా గొంతుక, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అణచివేయడం ఎవరి వల్లా సాధ్యం కాదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌తో పాటు దేశవ్యాప్తంగా జరిగిన పలు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా, రాస్తారోకో కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన పేపర్ లీకేజీ ఘటనలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని వృథా చేసిన ఈ ఘటనలపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి విద్యార్థుల తరపున ప్రశ్నించిన రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తిపై దాడి అని మండిపడ్డారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును కాలరాస్తూ కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం బీజేపీ ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, ప్రజల హక్కులను కాలరాస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, ఎస్సీ సెల్ బ్లాక్ అధ్యక్షులు రామకృష్ణ, మండల అధ్యక్షులు అశోక్, టౌన్ అధ్యక్షులు మాలే మల్లేష్ గౌడ్, మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి బిఖ్యానాయక్ పట్టణ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉప సర్పంచ్ లు లకుపతి నాయక్, హిరాసింగ్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్ మరియు నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, ఇమ్రాన్, నాయకులు వేణు పంతులు, సత్యం యాదవ్, జాంగిర్ అలీ, రాంచందర్ నాయక్, నరేందర్, జవహర్ నాయక్, జగన్, సురేందర్ రెడ్డి, మంకీ మహేష్, బాను కిరణ్ మూడ రవి, ఎర్రోళ్ల శ్రీకాంత్, వీరయ్య, కృష్ణ, శ్రీను, లక్ష్మణ్, నరేష్, మల్లేష్, కృష్ణయ్య, సోమరాజు సందీప్, ప్రవీణ్ గౌడ్, గాంధీ చంద్రశేఖర్, రమేష్, బాలకృష్ణ, భరత్ యాదవ్, శ్రీశైలం, వంశీ, కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో కాంగ్రెస్ ఆగ్రహ నిరసనలు

**- రాహుల్ ప్రియాంక అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



మిర్యాలగూడ, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టుకు నిరసనగా మిర్యాలగూడలో భారీ ఆందోళన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వంపై నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ప్రతిపక్షాల గొంతును అణచివేయడం అత్యంత దురదృష్టకరం. రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమే" అని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతంగా ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘాలు, యువజన--మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై ఎన్ఎస్‌యూఐ ఆగ్రహం

**- కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించిన జాతీయ కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్**



దేవరకొండ, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎన్ఎస్‌యూఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ అధ్యక్షతన దేవరకొండలో జరిగిన విలేకరుల సమావేశంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. "పేపర్ లీక్‌లపై ఇప్పటికీ స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం దురదృష్టకరం. వరుసగా జరిగిన లీక్‌ల వల్ల లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. "నిందితులను శిక్షించాల్సిన ప్రభుత్వం, న్యాయం కోసం గళం విప్పిన విద్యార్థులపై దౌర్జన్యం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం" అని పేర్కొన్నారు .కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ఎంపీలు ప్రధానమంత్రి నివాసం ముందు శాంతియుత నిరసన చేపట్టగా వారిని అరెస్ట్ చేయడం అత్యంత ఖండనీయమని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెం టనే రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌లపై సమగ్ర విచారణ జ రిపి అసలు నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమా ండ్ చేశారు. "విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత ప్రజాస్వామ్యబద్ధంగా తగిన తీర్పు ఇస్తుంది" అని హెచ్చరించారు.

## చర్లగూడెం భూ నిర్వాసితుల సమస్యలపై బీఎస్పీ ఆగ్రహం

**- న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ఐతరాజు అభయేందర్ హెచ్చరిక**



మర్రిగూడ, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలోని చర్లగూడెం ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యలపై బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఐతరాజు అభయేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మర్రిగూడ మండల బీఎస్పీ అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "2013 భూసేకరణ చట్టం ప్రకారం పూర్తి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం, యువతకు శాశ్వత ఉపాధి కల్పించాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూములు సేకరించి ఎన్నో సంవత్సరాలు గడిచినా పనులు పూర్తి కాకపోవడం ప్రభుత్వాల వైఫల్యమని, నిర్వాసితులు ఇప్పటికీ న్యాయం కోసం ఎదురుచూడటం బాధాకరమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజల సమస్యలను విస్మరించి మంత్రి పదవిపైనే దృష్టి పెట్టారని విమర్శించారు .ఫ్లోరైడ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. "నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు బీఎస్పీ పోరాటం ఆగదు, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కత్తుల పరమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్ట శివ, ఉపాధ్యక్షులు సుక్క రాములు, ఎర్రోళ్ల గిరి, మస్కు ఉదయ్, నాయకులు పల్లేటి రతివ, ఈద నరేష్, సురేష్, విజయ్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

# చర్లగూడెం భూ నిర్వాసితుల సమస్యలపై బీఎస్పీ ఆగ్రహం

**– న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ఐతరాజు అభయేందర్ హెచ్చరిక**



**మర్రిగూడ, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలోని చర్లగూడెం ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యలపై బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఐతరాజు అభయేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మర్రిగూడ మండల బీఎస్పీ అధ్యక్షుడు నాగిళ్ల మారయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "2013 భూసేకరణ చట్టం ప్రకారం పూర్తి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం, యువతకు శాశ్వత ఉపాధి కల్పించాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూములు సేకరించి ఎన్నో సంవత్సరాలు గడిచినా పనులు పూర్తి కాకపోవడం ప్రభుత్వాల వైఫల్యమని, నిర్వాసితులు ఇప్పటికీ న్యాయం కోసం ఎదురుచూడటం బాధాకరమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజల సమస్యలను విస్మరించి మంత్రి పదవిపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ఫ్లోరైడ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. "నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు బీఎస్పీ పోరాటం ఆగదు, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కత్తుల పరమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్ట శివ, ఉపాధ్యక్షులు సుక్క రాములు, ఎర్రోళ్ల గిరి, మస్కు ఉదయ్, నాయకులు పల్లేటి రతివ, ఈద నరేష్, సురేష్, విజయ్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై దాడిని ఖండించిన మల్లేష్ ముదిరాజ్




**చారకొండ, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు జూపల్లి మల్లేష్ ముదిరాజ్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసు బలప్రయోగాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో విద్యార్థులకు తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తపరచే హక్కు ఉంది. అలాంటి వారిపై లాఠీచార్జీలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం" అని అన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, కేసులను ఉపసంహరించాలని, గాయపడిన విద్యార్థులకు వైద్య సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. "విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం భవిష్యత్తులో అసంతృప్తికి దారితీస్తుంది" అని హెచ్చరించారు.

# సర్ విధానంపై బీఎల్ఏలకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ, జూలై 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్):** చింతపల్లి మండలం, కొండమల్లేపల్లి మండలం, దేవరకొండ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధానంపై అన్ని బూత్‌ల బీఎల్ఏలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి బీఎల్ఏ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు సర్ విధానంపై పూర్తి అవగాహన కల్పించి, అవసరమైన పత్రాలు సక్రమంగా సమర్పించేలా సహకరించాలని బీఎల్ఏలు, పార్టీ నాయకులకు సూచించారు. అదేవిధంగా ప్రతి బూత్‌లో ఓటరు జాబితా పరిశీలనను వేగవంతం చేసి, 100 శాతం ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలనిఎమ్మెల్యే బాలు నాయక్ ఆదేశించారు. ప్రతి ఇంటికి చేరుకుని అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటు హక్కు కీలకమని, ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, బీఎల్వోలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో దేవరకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నాయిని జమున–మాధవరెడ్డి, పిఏసిఎస్ ఛైర్మెన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్ రెడ్డి, సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, సర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కొర్ర రాంసింగ్ నాయక్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో యూనియన్ బ్యాంక్ సేవా కార్యక్రమాలు



**నాగర్‌కర్నూల్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో కస్టమర్ సర్వీస్ ఎక్సలెన్స్ కార్యక్రమం భాగంగా "షాప్ టు షాప్" వినియోగదారుల సేవా కార్యక్రమం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ ఎస్. విరిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్డీఎం చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై వినియోగదారులకు సూచనలు అందించారు. అధికారులు, సిబ్బంది వ్యాపార సంస్థలు, దుకాణాలను సందర్శించి వినియోగదారుల అవసరాలను తెలుసుకుని, పొదుపు––కరెంట్ ఖాతాలు, రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్, బీమా, పెట్టుబడి పథకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించిందని, అత్యుత్తమ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని బ్యాంక్ సిబ్బంది తెలిపారు.

# ఎన్ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తుల గడువు

**– ఆగస్టు 24 వరకు**



**నాగర్‌కర్నూల్, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ ప్రకటన ప్రకారం, 2026––27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల ఆగస్టు 24 వరకు సమర్పించాలి. విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ నమోదు అనంతరం దరఖాస్తు ఫారం, ఎన్ఆర్ కాపీలు, ఫీజు రసీదు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, దివ్యాంగుల వైద్య ధృవీకరణ పత్రాలు ప్రధానోపాధ్యాయుల ధృవీకరణతో సెప్టెంబర్ 1 లోపు డీఈఓ కార్యాలయానికి సమర్పించాలి. ధృవీకరణ లేని దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవని, అవసరమైన పత్రాలు జతచేయని అభ్యర్థులను జనరల్ కేటగిరీగా పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షను డిసెంబర్ 1, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు.

# వరాలకు అపమతగా ఉడాలి ఎసై మధుకర్



**ఎలిగేడు, జూలై 22 (నీలగిరి ఎక్‌పెస్):** వాతావరణ శాఖ హెచరికల పకార తుఫాను, భారీ వరాలు కురిసే అవకాశ ఉనదున పజలు అపమతగా ఉడాలని ఎలిగేడు ఎసై మధుకర్ సూచిచారు. పాత మటి ఇళు, పగుళు ఉన గోడలు, పైకపు నుడి నీరు కారే ఇళలో ఉడకుడా వెటనే ఖాళీ చేయాలని, విదుత్ సభాలు, టాన్‌ఫారరు, తెగిపోయిన తీగలకు దూరగా ఉడాలని ఆయన హెచరిచారు. తడి చేతులతో విదుత్ పరికరాలను తాకరాదని సూచిచారు. "వరాల వలన అతవసర పరిసితులు ఏరడితే వెటనే 100కు సమాచార ఇవాలి" అని ఎసై మధుకర్ పజలకు పిలుపునిచారు.ద

# నందికొట్కూరులో టిడిపి విస్తృతస్థాయి సమావేశం



**నందికొట్కూరు, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో టిడిపి శాసనసభ్యుడు గిత్త జయసూర్య ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "టిడిపి శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తే నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడుతుంది. సంక్షేమ ఫలాలు, అభివృద్ధి ప్రజలకు చేరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. ప్రతి బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జి రోజుకు కనీసం ఒక గంట సమయాన్ని పార్టీ అభివృద్ధి పనులకు కేటాయించాలని సూచించారు. "జూలై 27 నుంచి 45 రోజుల పాటు డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించాలి. స్థానిక ఎన్నికల్లో టిడిపి తిరుగులేని శక్తిగా నిలవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, మహిళా నాయకురాలు మిద్దె నీలమ్మ, వనజ, మీనాక్షి దేవితో పాటు క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేబినెట్ హోదా పొందిన ప్రభుత్వ విప్ విజయరమణారావుకు ఎలిగేడు మండల కాంగ్రెస్ నాయకుల సన్మానం



**ఎలిగేడు, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు రాష్ట్ర మంత్రి హోదా పొందిన సందర్భంగా బుధవారం ఎలిగేడు మండలం శివపల్లిలో ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, నూతనంగా నియమిత ఎలిగేడు సింగిల్ విండో చైర్పర్సన్ సామ రాజేశ్వర్రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏలేటి వెంకట్రెడ్డి, సర్పంచులు కప్పల ప్రవీణ్, పల్లెర్ల వెంకటేశ్ గౌడ్, కొమురయ్య, రంగు లత––శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ముంజం నరేశ్, నాయకులు అమ్ముల రమేష్ యాదవ్, కోరుకంటి వెంకటేశ్వర్రావు, బూర్ల వెంకటసత్యం, బండ రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసు ఛేదించిన కల్వకుర్తి పోలీసులు

**– రూ. 1.75 లక్షల నగదు, డీవీఆర్ స్వాధీనం**



**కల్వకుర్తి, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యానగర్ కాలనీలోని శ్రీ మహాలక్ష్మి వైన్ షాప్లో జూలై 19,20 రాత్రి జరిగిన చోరీ కేసును కల్వకుర్తి పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. నిందితుడు షాపు వెనుక గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించి, సీసీటీవీ కెమెరాల వైర్లను కత్తిరించి, రూ. 1,75,000 నగదు, డీవీఆర్ అపహరించి పరారయ్యాడు. దర్యాప్తులో భాగంగా జూలై 22న వాహనాల తనిఖీల సమయంలో సిమ్ముల మల్లికార్జున రెడ్డి చిన్న (32), గాంధీనగర్ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి రూ. 1,75,000 నగదు, డీవీఆర్, సుత్తి, కట్టింగ్ ప్లయర్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసు ఛేదనలో సీఐ బి. భీమ్ కుమార్, ఎస్సై ఎస్. కురుమూర్తి, సిబ్బంది బి. చిరంజీవి, ఎం.డి. నజీరుద్దిన్ కీలక పాత్ర పోషించారు. వీరిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, డీఎస్పీ ఎస్. వెంకట్ రెడ్డి అభినందించారు.

# కల్వకుర్తిలో అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**– ప్రజలు సహకరించాలని ఎస్ఐ కురుమూర్తి పిలుపు**




**కల్వకుర్తి, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్రమంగా ఇసుకను రవాణా చేసేవారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని కల్వకుర్తి ఎస్ఐ సుగూరు కురుమూర్తి హెచ్చరించారు. ప్రజలు తమ అవసరాల కోసం ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం ఆన్‌లైన్ ద్వారానే ఇసుకను పొందాలని సూచించారు. గత 60 రోజుల్లో 25 వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణా మొదటిసారి పట్టుబడితే పెనాల్టీ విధిస్తామని, పునరావృతమైతే డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేసి వాహనాలను కోర్టులో హాజరు పరుస్తామని స్పష్టం చేశారు. ప్రజలు అక్రమ ఇసుక రవాణాకు సహకరించవద్దని, సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. "ఇసుక రవాణా అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలి" అని ఎస్ఐ కురుమూర్తి పిలుపునిచ్చారు.

# శ్రీశైలం దేవస్థానం హుండీల లెక్కింపు



**శ్రీశైలం, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం హుండీల లెక్కింపులో గత 30 రోజుల్లో (22.06.2026––21.07.2026) భక్తులు సమర్పించిన విరాళాల ద్వారా మొత్తం రూ. 5,06,97,110 నగదు రాబడిగా లభించింది. అదనంగా 91 గ్రాములు 300 మిల్లీగ్రాముల బంగారం, 3 కేజీలు 160 గ్రాముల వెండి లభించాయి. విదేశీ కరెన్సీలలో 1353 అమెరికా డాలర్లు, 200 యు.ఏ.ఇ దిర్హామ్స్, 4 సింగపూర్ డాలర్లు, 120 ఇంగ్లాండ్ పౌండ్స్, 272 మలేషియా రింగిట్స్, 10 యూరోలు, 5 కెనడా డాలర్లు, 50 సౌత్ ఆఫ్రికా రాండ్స్ లభించాయి. సీసీ కెమెరాల నిఘా, పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య ఈ లెక్కింపును నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి సభ్యులు కె. కాంతివర్ధిని, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎస్. చంద్రశేఖర్, యూనిట్ అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు భరోసా కూటమి ప్రభుత్వం



**– నందికొట్కూరులో టూరిజం బోట్ ప్రారంభించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

**నందికొట్కూరు, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. బుధవారం నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూ నగర్ ఘాట్ వద్ద మత్స్యకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన టూరిజం బోట్ను ఆయన ప్రారంభించి ప్రయాణికులతో బోటులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గంగపుత్రుల జీవనోపాధి కోసం ప్రభుత్వం కొత్త బోటు మంజూరు చేసింది. నెహ్రూనగర్ ఘాట్ నుంచి తెలంగాణలోని మంచాలకట్ట ఘాట్ వరకు ప్రయాణికులు నిత్యం ప్రయాణించవచ్చు. దీంతో హైదరాబాద్‌కు దాదాపు 60 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది" అని తెలిపారు. బోటు నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోటును నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకుడు సురేందర్ రెడ్డి, పగిడ్యాల మండల టిడిపి నాయకులు, ముచ్చుమర్రి ఎస్సై నరేంద్ర, బెస్త సంఘం పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో విశ్వశాంతి మహాయాగం



**– ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక**

కల్వకుర్తి, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్ వద్ద 91వ విశ్వశాంతి మహాయాగం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. 16 రోజులపాటు జరిగే ఈ యాగానికి నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం లక్ష్మీ గణపతి హోమం, అఘోర పాశుపత రుద్ర హోమం, అమృత మృత్యుంజయ హోమం, చంద్రగ్రహణ హోమం నిర్వహించగా, 500 మంది రుత్వికులు పాల్గొన్నారు. శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో యాగం కొనసాగుతోంది. సాయంత్రం వేళ అష్టలక్ష్మి పూజలు, జ్యోతిర్లింగార్చనలు, కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగాయి. వేదమంత్రాల ఘోష పట్టణమంతా మారుమ్రోగింది. యాగశాలలో హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణం, భజనలు నిర్వహించారు. ప్రతిరోజూ దాదాపు 2 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నారు. యాగం ఆగస్టు 3 వరకు కొనసాగుతుందని స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరు రమేష్ బాబు, బిచని బాలకృష్ణ, పోల సురేందర్, మదన మురళి, జంగయ్య గౌడు, ప్రకాశ్, పెద్దయ్య గౌడు, కల్మచర్ల గోపాల్, బాదం రాఘవేందర్తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ త్వరితగతిన పూర్తి చేయాలి తహసీల్దార్ యాకన్న

**ఎలిగేడు, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తహసీల్దార్ యాకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామాల్లో ఎస్ఐఆర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి. అర్హులైన ఏ ఒక్కరి ఓటు జాబితా నుండి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి" అని బీఎల్వోలకు ఆదేశించారు. బీఎల్వోలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట బీఎల్వోలు భారతి, ప్రభావతి, వెంకటమ్మలు ఉన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యానికి విరుద్ధం

**– కాంగ్రెస్ నేతల తీరును ఖండించిన రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ,బీజేపీ ఎమ్మెల్యేలు**




హైదరాబాద్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్) : బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గూండాల తరహాలో వ్యవహరిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై రాళ్లతో దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనలో ఓ విలేకరి తలకు తీవ్ర గాయాలయ్యాయని, వెంటనే బీజేపీ కార్యాలయ సిబ్బంది ఆయనను సమీపంలోని కేర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విభేదాలను హింసాత్మక చర్యల ద్వారా వ్యక్తం చేయడం సమంజసం కాదని పేర్కొన్న వారు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కాంగ్రెస్ నాయకులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. అసాంఘిక శక్తులతో కలిసి ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్, రాష్ట్ర టీచర్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్ ముట్టడికి బీజేపీ నిరసన

**– డాక్టర్ వన్నాల వెంకట రమణ అరెస్ట్**

**– కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు..**

**– పోలీసు నిర్బంధాలతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని వ్యాఖ్య**

హైదరాబాద్, జూలై 22(నీలగిరి ఎక్స్ ప్రెస్) : తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం నుంచి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం (గాంధీభవన్) వరకు చేపట్టిన నిరసన (గెరావ్) కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో కలిసి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు.నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు డాక్టర్ వన్నాల వెంకట రమణతో పాటు పలువురు బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుని అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. ఒకవైపు ఢిల్లీలో నిరసనల పేరుతో విధ్వంసక చర్యలకు పాల్పడుతూ, మరోవైపు తెలంగాణలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులను పోలీసులు అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.పోలీసు నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో బీజేపీ నాయకులను, కార్యకర్తలను భయపెట్టలేరని, కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక, అరాచక విధానాలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.



ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, డా. పాల్వాయి హరీష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవ లక్ష్మి నర్సయ్య, అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్తో పాటు రాష్ట్ర బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటింటికి ఇంకుడు గుంత తప్పనిసరి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**– నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం**




యాదగిరిగుట్ట, జూలై 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటి వద్ద, వ్యవసాయ బావుల వద్ద ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విజ్ఞప్తి చేశారు.యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో 'క్యాచ్ ద రేన్ -- సేవ్ ఎవరీ డ్రాప్' అవగాహన బ్రోచర్‌ను ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, పాలకవర్గంతో కలిసి ఆవిష్కరించారు."వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేస్తే భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్యలు అధిగమించవచ్చు. ప్రతి నీటి చుక్కను కాపాడితే రేపటి భవిష్యత్తు సురక్షితం అవుతుంది" అని బీర్ల ఐలయ్య అన్నారు.మున్సిపల్ చైర్‌పర్సన్ వాణి భరత్ గౌడ్ మాట్లాడుతూ, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని ఉధృతంగా చేపడతామని, ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బరిగె రమ్య రాంచందర్, కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య స్ఫూర్తిపై బీజేపీ ప్రభుత్వం చేసిన దాడి

(దంతాలపల్లి) నీట్ పరీక్షలో అక్రమాలకు వ్యతిరేకంగా నిరసనకు దిగిన విద్యార్థులపై కేంద్ర బలగాల దాష్టికాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ పేర్కొన్నారు. నీట్ విద్యార్థులకు మద్దతుగా వెళ్లిన తమ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై మండిపడ్డారు. వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిందన్నారు.ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానపరచడమేనని అన్నారు.ప్రతిపక్షం ప్రశ్నిస్తే అరెస్ట్ చేయడం విమర్శిస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం బీజేపీ పాలనలో నిత్యకృత్యంగా మారిందని ఒక ప్రకటనలో ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విభిన్న అభిప్రాయాలను గౌరవించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరించడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు.దేశ రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ముందుంటుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించే ఈ పోరాటంలో వెనక్కి తగ్గేది లేదని డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ పేర్కొన్నారు.

# రేణుకుంట్ల లచ్చమ్మ కుటుంబానికి పరామర్శ

**- పాల్గొన్న డా. చందుపట్ల కీర్తి రెడ్డి,సత్యపాల్ రెడ్డి.**

భూపాలపల్లి,: జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలం మాందారిపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో పరమపదించిన భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు రేణుకుంట్ల చిరంజీవి గారి నాన్నమ్మ కీ.శే. రేణుకుంట్ల లచ్చమ్మ గారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి గారు, చందుపట్ల సత్యపాల్ రెడ్డి గారు కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# విప్లవ వీర యోధుడు ఆజాద్



చంద్ర శేఖర్ సీతారాం తివారి భారత స్వాతంత్ర్య సమరంలో అత్యంత ధైర్యవంతుడైన విప్లవకారుడు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయుధ పోరాటం ద్వారా స్వాతంత్ర్యం సాధించాలని నమ్మిన గొప్ప దేశభక్తుడు. తన జీవితమంతా దేశ విముక్తికే అంకితం చేసి, చివరి శ్వాస వరకు బ్రిటిష్ పోలీసులకు లొంగకుండా వీరమరణం పొందాడు. "ఆజాద్" అంటే (స్వతంత్రుడు) అనే పేరుకు తగ్గట్టుగానే జీవించి, అదే గౌరవంతో మరణించాడు.

**జననం మరియు బాల్యం:**
చంద్రశేఖర్ ఆజాద్ 1906 జూలై 23న భాభీరా గ్రామంలో జన్మించాడు. తండ్రి సీతారాం తివారి , తల్లి జాగ్రని దేవి. చిన్నప్పటి నుంచే ధైర్యం, దేశభక్తి, న్యాయస్ఫూర్తి ఆయనలో కనిపించేవి. విద్యాభ్యాసం కోసం వారణాసి వెళ్లాడు.

స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశం:
1921లో నాన్ కోఆపరేషన్ మూమెంట్ లో పాల్గొన్నాడు. అరెస్టు చేసినప్పుడు న్యాయమూర్తి పేరు అడిగితే "ఆజాద్", తండ్రి పేరు "స్వతంత్రం", చిరునామా "జైలు" అని సమాధానం చెప్పాడు. నుంచి ఆయన "చంద్రశేఖర్ ఆజాద్"గా ప్రసిద్ధి చెందాడు.

విప్లవ కార్యకలాపాలు:
రామ్ ప్రసాద్ బిస్మిల్లా నాయకత్వంలోని హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ లో చేరాడు. తరువాత భగత్ సింగ్ , సుఖ్ దేవ్ తాపర్ , శివరాం రాజగురు లతో కలిసి సంస్థను హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ గా బలోపేతం చేశాడు.

**కాకోరి ఘటన:**
1925లో జరిగిన కాకోరి రైలు దోపిడిలో విప్లవకారులు ప్రభుత్వ ధనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన తర్వాత అనేక మంది విప్లవ కారులు అరెస్టయ్యారు. కానీ ఆజాద్ మాత్రం పోలీసులకు చిక్కకుండా ఉద్యమాన్ని కొనసాగించాడు.

లాలా లజపతి రాయ్ మరణానికి ప్రతీకారం:
1928లో లాల లజపతి రాయి పై జరిగిన లాఠీచార్జ్ కారణంగా ఆయన మరణించాడు. దీనికి ప్రతీకారంగా భగత్ సింగ్ , రాజగురు , చంద్రశేఖర్ ఆజాద్ కలిసి జాన్ సాడర్స్ ను కాల్చిచంపారు.

**నాయకత్వం:**
చంద్రశేఖర్ ఆజాద్ గొప్ప నిర్వాహకుడు. యువ విప్లవకారులకు శిక్షణ ఇచ్చి, రహస్యంగా ఆయుధాలు సమకూర్చి, ఉద్యమాన్ని ముందుకు నడిపించాడు. క్రమశిక్షణ, ధైర్యం, దేశభక్తి ఆయన ప్రత్యేక లక్షణాలు.

**వీరమరణం:**
1931 ఫిబ్రవరి 27న అల్ఫ్రెడ్ పార్క్ లో బ్రిటిష్ పోలీసులు ఆయనను చుట్టుముట్టారు. చాలాసేపు ఒంటరిగా పోరాడి అనేక మంది పోలీసులను ఎదుర్కొన్నాడు. చివరికి తన వద్ద మిగిలిన చివరి బుల్లెట్‌తో తనను తానే కాల్చుకుని వీరమరణం పొందాడు. బ్రిటిష్ వారికి లొంగకూడదన్న తన ప్రతిజ్ఞను చివరి వరకు నిలబెట్టుకున్నాడు.

**వ్యక్తిత్వం:**
అసాధారణ ధైర్యసాహసాలు, అచంచల దేశభక్తి, క్రమశిక్షణ, త్యాగనిరతి.

**నాయకత్వ లక్షణాలు:**
స్వాతంత్ర్యంపై అపారమైన విశ్వాసం యువతకు సందేశం. చంద్రశేఖర్ ఆజాద్ జీవితం యువతకు ఆదర్శం. దేశం కోసం త్యాగం చేయడం, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవడం, నిజాయితీతో జీవించడం ఆయన జీవితంలో నేర్చుకోవాల్సిన గొప్ప విలువలు.

**భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన స్థానం:**
చంద్రశేఖర్ ఆజాద్ భారత విప్లవోద్యమానికి ప్రాణం పోశాడు. ఆయన ప్రభావంతో అనేక మంది యువకులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఆయన త్యాగం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.ముగింపుచంద్రశేఖర్ ఆజాద్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆయన జీవితం ధైర్యం, త్యాగం, దేశభక్తికి ప్రతీక. దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించిన ఈ మహావీరుడిని ప్రతి భారతీయుడు గౌరవంగా స్మరించుకుంటాడు. "బ్రిటిష్ చేతికి చిక్కను, స్వేచ్ఛగా జీవిస్తాను, స్వేచ్ఛగానే మరణిస్తాను" అనే ఆయన సంకల్పం భారత యువతకు నేటికీ స్ఫూర్తిదాయకం.



**వ్యాసకర్త : కేతపాక ప్రసాద్,**
**కాకతీయ రాజనీతి శాస్త్ర పరిశోధక విద్యార్థి**
cell:9177249062

# తెలంగాణ ఉద్యమ చరిత్రకే జయశంకర్ సార్ మణిహారం

**-జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక కన్వీనర్ కొణతం కృష్ణ**

హనుమకొండ, : ఆగస్టు 6 తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ 92వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ని బాలసముద్రం ఏకశిలా పార్కులో జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక కన్వీనర్ కొణతం కృష్ణ ఆవిష్కరించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ని గత ప్రభుత్వాలు ఇప్పటి ప్రభుత్వాలు మర్చిపోతున్నాయని, సామాజిక తెలంగాణ ఏర్పాటు లక్ష్యంగా పనిచేసిన ప్రొఫెసర్ జయశంకర్ గారిని అందరు గుర్తుపెట్టుకోవాలనే ఉద్దేశంతో ఆగస్టు 6 జయశంకర్ సార్ జయంతి కార్యక్రమం సందర్భంగా విద్యార్థి దశ నుండి తెలంగాణ సిద్ధాంతకర్త దాకా అనే పేరుతో తన జీవిత చరిత్రను ఉద్యమ చరిత్రను తెలియజేసే ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కి జయశంకర్ సార్ చేసిన కృషి తెలంగాణ ఉద్యమ చరిత్రకే ఒక మణిహారం లాంటిదని రాష్ట్ర ఏర్పాటు కి వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు మేధావులతో ఒక బలమైన సైదాంతిక పునాది ఏర్పాటు చేసిన వ్యక్తి జయశంకర్ అని కొనియాడినారు .డాక్టర్ కొంగ వీరస్వామి మాట్లాడుతూ జయశంకర్ సార్ నాన్ ముల్కి గో బ్యాక్ ఉద్యమం నుండి 1969 తొలిదశ 2001 మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన జయశంకర్ సార్ ని తెలంగాణ సమాజం మర్చిపోదని కొనియాడినారు. డాక్టర్ తిరునహరి శేషు మాట్లాడుతూ జయశంకర్ సార్ భౌగోళిక తెలంగాణ మాత్రమే



కాదు సామాజిక తెలంగాణ రావాలని కోరుకున్నారని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నాటి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటీ ముందు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఎందుకు కోరుతున్నాము బలమైన వాదనలు వినిపించి తెలంగాణ రాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ అనే అభిప్రాయపడినారు.ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ డాక్టర్ కొణతం కృష్ణా మాట్లాడుతూ సుమారు 500 వందల ఫోటోలతో ఎగ్జిబిషన్ ఎర్పాటు చేస్తున్నామని విద్యార్తులు , ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు తెలంగాణ జమ కారులు జయశంకర్ సార్ శిష్యులు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు, దారం జనార్ధన్, వడ్నాల నరేందర్ మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని మరొకసారి స్మరించుకోవటానికి ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమం ఉపయోగపడుతుంది కాబట్టి తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ వాదులు ఈ కార్యక్రమనాన్ని దిగ్విజ చేయాలనీ కోరారు, ఈ కార్యక్రమంలో మండల పరశురాములు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ డాక్టర్ రాజ మహమ్మద్ సమ్మయ్య, ఓం బ్రాహ్మమ్మశీ, సదానందం,గంగుల దయాకర్, ధర్మపూరి రాజగోవిందు, జంగం రాజానర్సు తదితరులు పాల్గొన్నారు.

# టీజీ రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణ ఇంట్లో ఏసీబీ సోదాలు - అక్రమ ఆస్తుల చిట్టా 100 కోట్లకు పైనే!

**హైదరాబాద్:** తెలంగాణలో అవినీతి అధికారుల పై అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక ఫోకస్ పెట్టి ంది. గత ఏడాది కాలంగా ఆదాయానికి మించి న ఆస్తుల వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఏసీబీ, వరుస దాడుల చేస్తోంది. ఈ క్రమంలో భారీ మొత్తంలో అక్రమ సొత్తు వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబా ద్ కేంద్రంగా పలువురు అధికారులపై నమోదైన అక్రమాస్తుల కేసులు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీ యాంశంగా మారాయి. ఏసీబీ తనిఖీలు చేపట్టిన అనేక ప్రాంతాల్లో అవినీతి అధికారుల అక్రమ ఆస్తుల చిట్టా 100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇటీవల కాలంలో భారీగా అక్రమాస్తులు కూడబెట్టిన ఇంజనీరింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులపై దాడులు నిర్వహించి, కోట్లాది రూపాయల ఆస్తులను వెలికితీస్తూ వస్తోంది. ఇవాళ ఉదయం నుంచి రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ ముత్యం వెంకటరమణ ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేస్తోంది. భారీగా నగదు, అక్రమ



ఆస్తులను గుర్తించారు. పది ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు : డీఈ ముత్యం వెంకటరమణ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాల్లో నగదు, డైమండ్స్, బంగారు, వెండి ఆభరణాలతో పాటు కమర్షియల్ బిల్డింగ్స్?, నాలుగు రెసిడెన్సియల్ ప్లాట్లను గుర్తించారు. వెంకటరమణ భార్య పేరిట రెసిడెన్సిషన్? అపార్టుమెంట్ నిర్మాణాల ను గుర్తించారు. ఉదయం నుంచి మొత్తంగా 10 ప్రాంతాల్లో సోదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఏసీబీ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. విలువైన ఫర్నీచర్, వస్తువులు : ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో సోదాలు జరుగుతున్నాయి. సాంకే తిక పరిజ్ఞానం ఉపయోగించి బ్యాంకు ఖాతాలు, భూపత్రాలపై ఆరాతీస్తున్నారు. డీఈ ఇంట్లో గుర్తించిన విలువైన ఫర్నీచర్, వస్తువులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నట్లు భావిస్తు న్నారు. ఇప్పటివరకు డీఈ వెంకటరమణకు చెందిన నివాసాల్లో చేసిన సోదాల్లో ప్లాట్లు, కమర్షియల్ బిల్డింగ్స్, అతని భార్య పేరిట చేస్తోన్న అపార్ట్‌మెంట్ నిర్మాణాల గుర్తించినట్లు డీఎస్పీ మాజిద్ అలీఖాన్ వెల్లడించారు. వందల కోట్ల ఆస్తులు? : డీఈ ముత్యం వెంకటరమణ నివాసాల్లో పెద్ద మొత్తంలో నగదు, భారీగా బంగారం, వెండి ఆభరణాలు, డైమండ్స్, విలువైన కార్లు, బ్యాంకు లాకర్?లో ఉన్న మొత్తాన్ని అధికారులు లెక్కిస్తున్నారు. బహిరంగ మార్కెట్?లో వందల కోట్ల రూపాయలు ఉండే అవకాశం ఉందని అవినీతి నిరోధక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సోదాలు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది. అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు చెబుతున్నారు.

# ఆస్పత్రి నుంచి ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి డిశ్చార్జ్

**హైదరాబాద్, జులై 22:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. మహిళా ట్రైనీ ఐపీఎస్ కేసులో ఉదయ్ ఆత్మహ త్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందిన ఉదయ్ (బుధ వారం) డిశ్చార్జ్ అయ్యారు. ఉదయ్ పేరుతో సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఆయన కోలుకున్న తర్వాత వాంగ్మూలాన్ని నమోదు చేసే అవకాశం ఉంది. మరోవైపు తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేవేయాలంటూ తెలంగాణ హైకోర్టును ఉదయ్ కృష్ణారెడ్డి ఆశ్రయించారు. ట్రైనీ ఐపీఎస్ క్వాష్ పిటిషన్‌పై సోమవారం(జులై 27) విచారణ చేపడతామని న్యాయస్థానం తెలిపిం ది. అప్పటి వరకు ఎలాంటి తదుపరి చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరగా.. అందుకు హైకోర్టు నిరాకరించిం ది. కాగా, హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక



వేధింపులకు సంబంధించి అత్తాపూర్‌లో నమోదైన కేసును ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు పోలీసు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఉన్నతాధికారుల నిర్ణయంతో తదుపరి దర్యాప్తును షీటీమ్స్‌కు అప్పగించారు. షీటీమ్స్ డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో జాతీయ పోలీస్ అకాడమీకి చేరుకున్న షీటీమ్స్ డీసీపీ.. మహిళా ట్రైనీ ఐపీఎస్ వాంగ్మూలాన్ని నమోదు చేయనున్నారు. పోలీసు అధికారుల సమక్షంలో స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు.

# అదుపుతప్పి మూడు వాహనాలను ఢీకొన్న వాటర్ ట్యాంకర్.. ఒకరి మృతి



**రంగారెడ్డి, జులై 22:** జిల్లాలోని నార్సింగి-పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన ట్యాంకర్.. బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళు తున్న సుశీల్ కుమార్(28) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం తర్వాత అదుపు తప్పిన ట్యాంకర్ మరో కారు, స్కూటీని కూడా ఢీ కొట్టింది. దీంతో మొత్తం మూడు వాహనాలను వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ట్యాంకర్ డ్రైవర్ రంజిత్ సింహాను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని స్వా ధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అలాగే గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సుశీల్ మృతి సమాచారాన్ని కుటు ంబసభ్యులకు తెలియజేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ గాంధీభవన్ ముట్టడికి యత్నించిన బీజేపీ నేతలు

**హైదరాబాద్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్ద రాహుల్ గాంధీ నేతృత్వంలో ధర్నా చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ గాంధీ భవన్ ముట్టడికి యత్నించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు నేతృత్వంలో పార్టీ రాష్ట్ర కార్యాల యం నుంచి గాంధీ భవన్ భవన్ ముట్టడికి బయల్దేరిన కాషాయ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం సమీపంలో బారికేడ్లు వేసి బీజేపీ నేతలను నిలువరించారు. దీంతో బీజేపీ రాష్ట్ర కార్యాల యం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాషాయ శ్రేణులకు పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో పాటు కాషాయ శ్రేణులను అరెస్ట్ చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్?కు తరలించారు. మరోవైపు బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు గాంధీ భవన్ వద్ద ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించివేశారు. లోక్ భవన్‌ను ముట్టడించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



రామచందర్ రావు అన్నారు. రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. ప్రతిపక్ష నేతగా చర్చకు రమ్మంటే పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విదేశీ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. విదేశీ కుట్రలకు రాహుల్ గాంధీ వత్తాసు పలుకు తున్నారని మండిపడ్డారు. బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు యత్నం : బీజేపీ నేతలు గాంధీభవన్ ముట్టడిని నిరసిస్తూ పోటీగా బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు యత్నించాయి. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు బీజేపీ ఆఫీస్ ముట్టడికి యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలోనే బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం ఒకరిపైకి ఒకరు కర్రలు, రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో ఓ మహిళా కానిస్టేబుల్ కాలికి గాయమైంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలను పోలీసులు అదుపులోకి ముట్టడులతో భారీగా ట్రాఫిక్ జామ్? ఏర్పడింది. నాంపల్లి నుంచి ఎంజీబీఎస్? వెళ్లే మార్గంలో వాహనాల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# కాంగ్రెస్ చలో లోక్‌భవన్ ఉద్రిక్తం పీసీసీ చీఫ్, మంత్రుల అరెస్ట్

**హైదరాబాద్:** దిల్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "చలో లోక్‌భవన్" ర్యాలీ స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు చేపట్టిన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో పోలీసులు మధ్యలోనే అడ్డుకుని కాంగ్రెస్ ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేసి లోక్‌భవన్ పరిస రాలను పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దిల్లీలో నిన్న రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతల అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ర్యాలీని దృష్టిలో



ఉంచుకుని నెక్లెస్ రోడ్డు నుంచి లోక్‌భవన్ వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో మొదలైన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో ప్రధాన కూడలి వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ముందే మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు ర్యాలీని నిలిపివే శారు. పోలీసుల అడ్డుకట్టను దాటేందుకు కొందరు కార్యకర్తలు ప్రయత్నించ డంతో స్వల్పంగా ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అప్పటికే మోహరించి న పోలీసు బలగాలకు అదనంగా పంజాగుట్ట పోలీసు స్టేషన్ నుంచి సిబ్బందిని, మహిళా కానిస్టేబుళ్ల ను రప్పించి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇదే సమయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబీర్ అలీ సహా పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులను నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మిగిలిన నాయకులను పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తరువాత వీళ్లను పోలీసులు విడుదల చేశారు. "రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం, మహిళ అని చూడకుండా ప్రియాంక గాంధీని తోపులాటతో అరెస్టు చేశారు. పోలీసులు ప్రజాస్వామ్యం మంటగలిసే విధంగా వ్యవహరించారు. మోదీ నీట్ పరీక్షలు సక్రమంగా నిర్వహించ లేకపోయారు. ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటివరకు రాజీనామా చేయలేదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారు. పోలీసులతో రాజ్యాంగాన్ని నడుపుతామంటే భారతదేశంలో కుదరదు" - మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు

కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి నిరసన : దిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిరసన తెలిపారు. కొడంగల్?లో తననివాసం నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న కార్యకర్తలు, కొడంగల్ ప్రజలు పాల్గొన్నారు. హనుమకొం డలో నిరసన : ఏఐసీసీ పిలుపు మేరకు హనుమకొండలో చేపట్టిన నిరసనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఖమ్మంలో భారీ ర్యాలీ : రాహుల్‌గాంధీ శ్రేణుల భారీ ర్యాలీ చేపట్టారు. ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ చేశారు. ర్యాలీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# తెలంగాణలో అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం

**హైదరాబాద్, జులై 22 :**

తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది. కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులు గా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండ ించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ



(అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి.

# రేషన్‌దారులకు కేవైసీ కష్టాలు.

**వరంగల్:** రేషన్‌దుకాణాలలో లబ్ధిదారులు కేవైసీ చేసుకోవ డానికి సాంకేతిక సమస్యలు అడ్డువస్తున్నాయి. ఇప్పటి వరకు కేవైసీ చేసుకొని వారు ఈనెల 31వతేదీలోగా చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అనేక మంది రేషన్ దుకాణాలకు వెళ్లి ఆధార్‌కార్డు నెంబర్ నమోదు చేస్తే అది ఓపెన్ కావడంలేదని చెబుతున్నారు. ఆధార్ కార్డుకు



సంబంధించిన వెబ్‌సైటులోనే సమస్య ఉంద ని అంటున్నారు. జిల్లా అంతటా ఇదే సమస్య ఉందని చెబుతున్నానరు. దీంతో కేవైసీ కోసం వచ్చిన వారు నిరాశతో వెనక్కి వెళ్లిపోయారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలకు కేవైసీ చేయడానికి వస్తే కావడంలేదని లబ్ధిదారులు తెలిపారు. ఇలా అయితే వారి పేరిట వచ్చే రేషన్ పోతుందా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 509 రేషన్ దుకాణాలలో వేలల్లో ఐదేళ్లలోపు పిల్లలుంటారు. వారి పరిస్థితి ఎంటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయంపై జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్యను వివరణ కోరగా ఆందోళన అవసరంలేదన్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఆ వయస్సు పిల్లలవి కేవైసీ కాకుంటే పోతాయని ఏవీ చెప్పలేదని స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్:** ట్రైనీ ఐపీఎస్ఉదయకృష్ణారెడ్డి పిటిషన్?పై విచా రణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసిం ది. కేసుకు సంబంధించిన వివరాలు సమర్పి ంచాలంటూ పోలీసులను ఆదేశించింది. పిటిష నర్ ట్రైనీ ఐపీఎస్?గా ఉన్నారని అప్పటి వరకు తదుపరి చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలంటూ ఆయన తరఫు న్యాయవాది కోరినా హైకోర్టు అంగీకరించలేదు. తనపై నమోదైన కేసును కొట్టేయాలంటూ ఉదయకృష్ణా రెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తప్పుడు ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారని ఆ కేసును కొట్టేవేయాలంటూ పిటిషన్‌లో కోరారు. మహిళా భద్రతా విభాగానికి కేసు పర్యవేక్షణ బాధ్యతలు : నేషనల్ పోలీస్



అకాడమీలో (ఎన్‌పీఏ) మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసు రోజుకో కీలక మలుపు తిరుగుతోంది. కేసు పర్యవేక్షణ బాధ్యతను ఉన్నతాధికారులు మహిళా భద్రతా విభాగానికి అప్పగి ంచారు. షీటీమ్స్ డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు కొన సాగనున్నట్టు సమాచారం. సోమవారం ఉదయం అప స్మారక స్థితిలో ఎస్సార్ నగర్‌లోని ప్రైవేటు ఆసుప త్రిలో చేరిన నిందితుడు ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృ ష్ణారెడ్డి ఆరోగ్యం కుద ుటపడినట్లు సమాచారం. బుధవారం ఆయన్ను హాస్పిటల్? నుంచి డిశ్చార్జి చేయనున్నట్టు తెలిసింది. మరోవైపు ఉదయ్?కృష్ణారెడ్డి పిటిషన్?పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. తనపై ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లుగా మహిళా ట్రైనీ ఐపీఎస్ చేసిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విధితమే. అనంతరం తన ఆత్మహత్యకు బాధితురాలితో పాటు నలుగురు వ్యక్తులు కారణమంటూ నిందితుడి పేరుతో ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు ఆయన ఎలాంటి విషపదార్థం తీసుకోలేదని మెడికల్ చెకప్?లో తేలడంతో కేసు మరో మలుపు తిరిగింది. నిందితుడు కోలుకున్నాక వివరాలు సేకరించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేయనున్నారు.

# తిరిగి జట్టులోకి వచ్చిన కమిన్స్, హేజిల్‌వుడ్, లైయాన్

**• బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు**

**ఆస్ట్రేలియా జట్టు ప్రకటన**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా.. వరుసగా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం బలమైన జట్టును బరిలోకి దింపుతోంది. వచ్చే నెలలో జరగనున్న ఈ మ్యాచ్‌లకు సంబంధించి క్రికెట్ ఆస్ట్రేలియా తాజాగా జట్టును ప్రకటించింది. ప్యాట్ కమిన్స్ సారథ్యంలో 13 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది. గాయం నుంచి కోలుకున్న జోష్ హేజిల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లైయాన్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ 2025-27లో భాగంగా స్వదేశంలో బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌తో ఆ జట్టు సీనియర్లు పునరాగమనం చేయనున్నారు. గాయాల కారణంగా సుదీర్ఘ ఫార్మాట్‌కు దూరమైన ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లైయాన్ బంగ్లా సిరీస్‌తో ఎంట్రీ ఇవ్వనున్నారు. ప్రస్తుతానికి 13 మందితో స్క్వాడ్‌ను ఎంపిక చేశామని, అవసరాన్ని బట్టి మార్పులు చేస్తామని, అందుకోసం తమ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ పేర్కొన్నాడు.ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఆస్ట్రేలియా, ఎనిమిది మ్యాచ్‌లలో ఏడు విజయాలు, ఒక ఓటమితో, 87.50 విజయ శాతంతో పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో ఉంది. బంగ్లాదేశ్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి.. అగ్రపీఠాన్ని మరింత పదిలం చేసుకోవాలని ఆ జట్టు భావిస్తోంది. ఆస్ట్రేలియా వచ్చే 8 నెలల వ్యవధిలో 14 టెస్టులు ఆడనుంది. ఇందులో భారత్ వేదికగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కూడా జరగనుంది. మరోవైపు బంగ్లాదేశ్ జట్టు 18 ఏళ్ల తర్వాత టెస్టులు



ఆడేందుకు ఆస్ట్రేలియాకు వెళ్తోంది. ఆగస్టు 13 నుంచి ఆగస్టు 26 వరకు ఇరుజట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్ జరుగనుంది.బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టు: ప్యాట్‌పాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కేరీ, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుషేన్, నాథన్ లియాన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, జేక్ వెదరాల్డ్, బ్యూ వెబ్‌స్టర్

# కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్ మార్పుపై విమర్శలు

**• టీమిండియాపై**

**మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ ఆగ్రహం**

లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో కేఎల్ రాహుల్‌ను నంబర్ 6 స్థానంలో బ్యాటింగ్‌కు పంపడంపై భారత మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ అసహనం వ్యక్తం చేశారు. ఈ మ్యాచ్‌లో 388 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 27 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-2తో కోల్పోయింది. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన ఆయన.. రాహుల్ బ్యాటింగ్ స్థానాన్ని మార్చడంపై ప్రశ్నలు లేవనెత్తారు. "అంత భారీ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఎవరైనా కేఎల్ రాహుల్‌ను నంబర్ 6 స్థానంలో పంపుతారా? క్లిష్టమైన పరిస్థితుల్లో లక్ష్య ఛేదనలో అతడు జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు కదా. రాహుల్ నంబర్ 6 లేదా 7 స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడా? ఇది చాలా అన్యాయం. అతడి బాడీ లాంగ్వేజ్ కూడా ఏదో ఆందోళనలో ఉన్నట్లుగా అనిపించింది" అని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నారు. సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీల విషయంలో ఎలాగైతే తప్పులు చేశారో ఇప్పుడు కేఎల్ రాహుల్ విషయంలోనూ అలాగే చేస్తున్నారు. ఒకవేళ లార్డ్స్ వన్డేలో కేఎల్ రాహుల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఉంటే 2023 ప్రపంచకప్ మాదిరిగా విరాట్ కోహ్లీకి తోడుగా నిలిచేవాడు. రాహుల్ వేగంగా పరుగులు రాబడతాడు. కానీ, మ్యాచ్ దాదాపు ముగిసిపోయిన తర్వాత అతడిని బ్యాటింగ్‌కు పంపారు. ఓవర్‌కు 15 పరుగులు అవసరమైనప్పుడు అక్షర్ పటేల్‌తో కలిసి రాహుల్ మ్యాచ్‌ను గెలిపిస్తాడా?" అని శ్రీకాంత్



ప్రశ్నించారు. కాగా భారత్ స్కోరు 304/4 వద్ద ఉన్నప్పుడు రాహుల్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అప్పటికి ఓవర్‌కు దాదాపు 15 పరుగులు అవసరమయ్యాయి. ఈ సమయంలో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో రాహుల్ ఔట్ అయ్యాడు. 12 బంతుల్లో 8 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఈ వన్డే సిరీస్‌లో రాహుల్ కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడారు. తొలి వన్డేలో ఒక పరుగు చేసిన అతడు, లార్డ్స్‌లో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో 12 పరుగులు చేశారు. గాయం కారణంగా రెండో వన్డేకు దూరమయ్యాడు.

# యూకే పిచ్‌లు సవాల్ విసురుతాయి

**అందుకే అక్కడ మేం ఓడిపోయాం**

**భారత యువ క్రికెటర్ తిలక్ వర్మ**

భారత క్రికెట్ జట్టులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం జింబాబ్వే పర్యటనలో వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలుగు కుర్రాడు తిలక్ వర్మ విదేశీ పర్యటనలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు అభిమానుల నుంచి భారీ అంచనాలు ఉంటాయని చెప్పాడు. ఇదే సమయంలో జట్టు యాజమాన్యం నుంచి బాధ్యతలు ఉంటాయని తెలిపాడు. ఇటీవల ముగిసిన ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలలో వాతావరణం, పిచ్ పరిస్థితులు ఎంతో భిన్నంగా ఉన్నాయని తిలక్ అభిప్రాయపడ్డాడు. కాగా గత రెండేళ్లలో అంటే టీ20 ప్రపంచకప్ 2024 జరిగిన తర్వాత, భారత జట్టు ఆడిన మ్యాచ్‌లలో మెజారిటీ ఆసియా ఖండంలోనే జరిగాయి. ఈ పరిస్థితుల్లో స్వదేశీ పిచ్‌లతో పాటు ఉపఖండంలోని అనుకూలమైన మైదానాల్లో



ఎక్కువగా ఆడిన తర్వాత, నేరుగా విదేశీ పరిస్థితులకు మారి అక్కడ ఆడటం సవాల్‌తో కూడుకున్న విషయమని తిలక్ వర్మ అన్నాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్, ఐర్లాండ్ వంటి దేశాల్లో బంతి అనూహ్యంగా స్వింగ్ అవ్వడం, సీమ్ కావడం వల్ల బ్యాటర్లు తమ శైలిని మార్చుకోవాల్సి వస్తుందని అతడు వెల్లడించాడు. ఇదే సమయంలో ఇంగ్లాండ్ జట్టును తిలక్ వర్మ ప్రశంసించాడు. టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్స్ వరకు వెళ్లిన ఇంగ్లాండ్ ఎంత అత్యుత్తమమైన జట్టో అందరం చూశామని అతడు గుర్తు చేశాడు. అంతటి పటిష్టమైన జట్టును, వారి సొంత గడ్డపై ఎదుర్కోవడం సవాల్ విసురుతుందని వివరించాడు. విదేశీ వేదికలపై అగ్రశ్రేణి జట్లతో ఆడేటప్పుడు దక్కే అనుభవం యువ ఆటగాళ్లకు భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని.. సవాళ్లను ఎదుర్కొనే మానసిక దృఢత్వాన్ని పెంచుతుందని పేర్కొన్నాడు. ప్రస్తుతం జింబాబ్వే పర్యటనలో ఉన్న భారత యువ జట్టుకు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ పర్యటన ద్వారా మళ్లీ పాత ఫామ్‌ను అందుకోవాలని చూస్తున్నాడు. విదేశీ పర్యటనలలో ఎదురైన ఓటములు, కష్టమైన పరిస్థితుల నుంచి పాఠాలు నేర్చుకుని.. మెరుగ్గా రాణిస్తామని ధీమా వ్యక్తం చేశాడు. ఐర్లాండ్ చేతిలో 0-2, ఇంగ్లాండ్ చేతిలో 0-4 తేడాతో భారత్.. టీ20 సిరీస్‌లలో



# వైభవ్ ఆటగాడిని చూడలేదు

**• సూర్యవంశీపై హర్భజన్ సింగ్ ప్రశంసల జల్లు**

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. వైభవ్ లాంటి ఆటగాడిని తాను ఇప్పటివరకు చూడలేదని కొనియాడాడు. వైభవ్ అత్యంత ప్రతిభావంతమైన ఆటగాడని, గతంలో ఏ ఆటగాడు సాధించని ఘనతను అందుకుంటున్నాడని కితాబిచ్చాడు.ఇంగ్లండ్ పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ మరో కీలక పోరుకు సిద్ధమయ్యాడు. ఇంగ్లండ్‌తో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన వైభవ్.. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో బరిలోకి దిగనున్నాడు. గురువారం హరారే వేదికగా జరిగే మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్ నేపథ్యంలో జియోస్టార్ షోలో మాట్లాడిన హర్భజన్ సింగ్.. వైభవ్ సూర్యవంశీ ఫియర్‌లెస్ బ్యాటింగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఆడుతున్నట్లు గతంలో ఎవరూ ఆడలేదు. అతను అసాధారణ నైపుణ్యం కలిగిన ప్లేయర్. ఇలాంటి ఆటగాడిని నేను ఇప్పటి వరకు చూడలేదు. ఒకప్పటి యువతకు.. ఇప్పటి కుర్రాళ్లకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం మీడియా, సోషల్ మీడియా. అప్పట్లో కూడా ఇలాంటి ఆటగాళ్లు ఉన్నారేమో. కానీ ఈ రోజుల్లో సోషల్ మీడియా ద్వారా ఎక్కువగా వెలుగులోకి వస్తున్నారు.ఫియర్‌లెస్ మనస్తత్వం, తమకు నచ్చే విధంగా ఆడే ఆటగాళ్లను జనాలు అంగీకరించడమే ఆటలో వచ్చిన అతి పెద్ద మార్పు.'అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు.వైభవ్ ఐపీఎల్ అరంగేట్రానికి ముందు జరిగిన ఓ సంఘటనను కూడా హర్భజన్ సింగ్ ఈ సందర్భంగా గుర్తు చేశాడు. 'రాజస్థాన్ రాయల్స్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ఉన్న సమయంలో వైభవ్ సూర్యవంశీని తొలి బంతిని ఎలా ఆడుతావు? అని అడిగాడు. దానికి వైభవ్.. అది నా జోన్‌లో ఉంటే సిక్స్ బాదుతానని బదులిచ్చాడు. అన్నట్లుగానే శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో తొలి బంతినే సిక్స్ బాది తన ఐపీఎల్ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించాడు. ఇది వైభవ్ ఫియర్‌లెస్ మనస్తత్వాన్ని తెలియజేస్తోంది'అని తెలిపాడు. తన కెరీర్‌లో సచిన్ టెండూల్కర్ ఇచ్చిన సలహాను ఎప్పటికీ మర్చిపోనని హర్భజన్ సింగ్ గుర్తు చేసుకున్నాడు. 'క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ నాకు ఇచ్చిన సలహాను నేను ఎప్పటికీ మర్చిపోను.'నీ క్రికెట్ ప్రయాణంలో ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయి. ఎన్నో విషయాలు నీ దారిలోకి వస్తాయి. కానీ ఎటువైపు నీ మనసును మళ్లించకుండా ఆటపై మాత్రమే దృష్టిని పెట్టాలి. ఇలా కొనసాగితేనే ఈ ప్రపంచంలో నిన్ను ఎవరూ ఆపలేరు. నువ్వు ఏది అవ్వాలనుకున్నా.. ఏది చేయాలనుకున్నా.. నువ్వు సరైన మార్గంలో నడిస్తేనే.. అన్ని రకాల గౌరవం, కీర్తిని పొందుతావు.'అని సచిన్ పాజీ నాకు చెప్పాడు.'అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. ఇదే సలహాను వైభవ్ సూర్యవంశీతో పాటు ఈ తరం యువ ఆటగాళ్లకు ఇవ్వాలనుకుంటున్నాను. 'ఆటపైనే ఫోకస్ పెట్టాలి. ఆట కంటే మనం పెద్ద కాదనే విషయాన్ని గ్రహించాలి. ఈ ఆట వల్లే మనం ఈ స్థాయికి వచ్చామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. నీ వైఖరి సరిగ్గా లేకపోతే.. ఈ ఆట ఏంత ఇచ్చిందో అంతే వేగంగా వెనక్కి తీసుకుంటుంది.'అని హర్భజన్ సింగ్ హెచ్చరించాడు.

# నేటి నుంచి కామన్‌వెల్త్ క్రీడలు

**• 11 రోజులు, 10 క్రీడాంశాలు, 215 మెడల్ ఈవెంట్స్**



**గ్లాస్గో (స్కాట్లాండ్) :** స్కాట్లాండ్‌లోని పోర్ట్‌నగరం కామన్‌వెల్త్ క్రీడలకు స్పోర్ట్స్ క్యాపిటల్‌గా మారింది!. 2014లో కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన గ్లాస్గో నగరం.. 2026 క్రీడల ఆతిథ్యం నుంచి ఆస్ట్రేలియా తప్పుకోవటం మరోసారి నిర్వహణ బాధ్యతలను తీసుకుంది. ఆర్థిక సవాళ్లు, నిర్వహణ వ్యయ భారం కామన్‌వెల్త్ క్రీడలను కళ తప్పేలా చేశాయి. 11 రోజులు, 10 క్రీడాంశాలు, 215 మెడల్ ఈవెంట్లతో నేటి నుంచి కామన్‌వెల్త్ క్రీడలు ఆరంభం కానున్నాయి. బ్రిటీష్ పాలిత దేశాలు పోటీపడే ఈ క్రీడల్లో ఈసారి 74 దేశాల నుంచి సుమారు 3 వేల మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. నేటి ఆరంభ వేడుకలతో పోటీలు ప్రారంభం కానుండగా.. ఆగస్టు 2న ముగింపు వేడుకలతో క్రీడలు ముగియనున్నాయి. 2022లో బర్మింగ్‌హామ్ కామన్‌వెల్త్ క్రీడల్లో 20 క్రీడాంశాలు ఉండగా.. తాజాగా గ్లాస్గోలో వాటిని 10కు కుదించారు. బాస్కెట్‌బాల్, ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, బౌల్స్, బాక్సింగ్, జూడో, నెట్‌బాల్, స్విమ్మింగ్, ట్రాక్ సైక్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్‌లో 74 దేశాల క్రీడాకారులు పోటీపడనున్నారు. పారా విభాగంలో ఆరు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. తొలి రోజు పోటీల్లో బౌల్స్, పారా బౌల్స్ ఈవెంట్లు జరుగనున్నాయి. గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలకు భారత్ 125 మందితో కూడిన బలమైన జట్టును పంపిస్తోంది. ఒలింపిక్ పతక విజేతలు నీరజ్ చోప్రా, మీరాబాయి చాను వంటి మేటి అథ్లెట్లు గ్లాస్గోలో బరిలోకి దిగుతున్నారు.




# సింధు, సేన్ ముందంజ

**చాంగ్జౌ :** జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన జోష్‌లో ఉన్న స్టార్ షట్లర్ పీవీ సింధు.. చైనా ఓపెన్‌నూ విజయంతో ఆరంభించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు.. 21-14, 9-21, 21-10తో భారత్‌కే చెందిన యువ షట్లర్ ఉన్నతి హుడాను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది.పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్.. 22-20, 15-21, 21-14తో యుశి టనాక (జపాన్)ను చిత్తుచేశాడు. మరో పోరులో భారత యువ సంచలనం ఆయుష్ శెట్టి.. 21-17, 5-21, 21-17తో ప్రపంచ 11వ ర్యాంకర్ అల్వి ఫర్హాన్ (ఇండోనేషియా)కు షాకిచ్చాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల-తనీషా క్రాస్టో జంటతో పాటు మెన్స్ డబుల్స్‌లో అర్జున్-హరిహరన్ జోడీ తొలి రౌండ్‌కే ఇంటిబాట పట్టింది.

# ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ రాజమౌళి

స్టార్ డైరెక్టర్‌గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి కూడా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్‌లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు. తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్‌లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు కూడా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు. చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు కూర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా?' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. ఆ సంఘటన జరిగినప్పుడు రాజమౌళి ఏలూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలుస్తోంది. అనంతరం కొంతకాలం చదువుకు విరామం ఇచ్చిన ఆయన, తర్వాత ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశారు. ఆ తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టి రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. సినీ పరిశ్రమలో స్థిరపడిన తర్వాత తమ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న కుటుంబానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రమను ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి రమ ఆయన వ్యక్తిగత జీవితంలోనే కాకుండా వృత్తిపరమైన ప్రయాణంలోనూ ఎంతో సపోర్ట్‌గా నిలుస్తున్నారు.






# రంభ ఊర్వశి మేనక నుంచి సాంగ్ విడుదల

అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంభ ఊర్వశీ మేనక'. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో సురభి కథానాయికగా కనిపించనున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలోని 'నా కంటి మీద కునుకే'అంటూ సాగే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ ఆలపించారు.

# స్పిరిట్ 40శాతం షూటింగ్ పూర్తి

## కీలక అప్‌డేట్ ఇచ్చిన సందీప్ వంగా




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట్' చిత్రీకరణ ఇప్పటికే 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమా ప్రతి ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందిస్తున్నామని, ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సందీప్ చేసిన ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా షూటింగ్ వేగంగా సాగుతుండటంతో విడుదలపై కూడా త్వరలో మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్లు సమాచారం. అకాడమీ టాపర్‌గా ఎదిగిన ఓ పోలీస్ అధికారి జీవితంలో జరిగే అనూహ్య పరిణామాలు, అతనిపై వచ్చిన ఆరోపణలు, వాటి వెనుక ఉన్న అసలు నిజం కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# సంక్రాంతి బరి నుంచి చిరు తప్పకున్నారా ?



ఒకప్పుడు సంక్రాంతి అంటే తెలుగు సినీ పరిశ్రమకు పెద్ద పండుగగా భావించేవారు. ఆ సీజన్‌లో సినిమా విడుదలైతే భారీ వసూళ్లు ఖాయమనే నమ్మకం నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లలో ఉండేది. కానీ గత కొన్నేళ్లుగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒకేసారి పలువురు స్టార్ హీరోల సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కోసం తీవ్ర పోటీ నెలకొంటోంది. ఫలితంగా స్క్రీన్లు పంచుకోవాల్సి రావడం, కలెక్షన్లు విడిపోవడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రంపై ఓ ఆసక్తికర ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మొదట ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని చిత్రబృందం భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని పునఃసమీక్షిస్తున్నట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి బాక్సాఫీస్ వద్ద గరిష్ఠ స్థాయిలో వసూళ్లు రావాలంటే పోటీ లేకుండా సోలోగా విడుదల చేయడం ఉత్తమమనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. సంక్రాంతి సమయంలో కనీసం రెండు లేదా మూడు పెద్ద సినిమాలు విడుదలయ్యే అవకాశాలు ఉండటంతో, కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారట. అందుకే సంక్రాంతి రేసు నుంచి తప్పుకుని సమ్మర్ లేదా మరో అనుకూలమైన ఫెస్టివల్ సీజన్‌లో సినిమాను విడుదల చేసే అంశంపై అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ప్రచారాలపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# వారానికి 4 రోజులే పనా?.. భారతదేశానికి అది సాధ్యం కాదు: నటుడు విక్రాంత్ మాస్సే

ఉత్తర యూరప్ దేశాల్లో మాదిరిగా వారానికి నాలుగు రోజులే పనిచేసే 'ఫోర్-డే వర్క్ వీక్' నమూనా ప్రస్తుతానికి భారతదేశానికి అస్సలు సరిపడదని ప్రముఖ నటుడు విక్రాంత్ మాస్సే అభిప్రాయపడ్డారు. తన రాబోయే వెబ్ సిరీస్ 'ముసాఫిర్ కేఫ్' ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన పనివేళలు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై తన స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. మనది ఇంకా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, యువ ప్రతిభ కలిగిన ఈ ప్రజాస్వామ్య దేశం అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వచ్చే 40 నుంచి 50 ఏళ్ల పాటు ఎంతో కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా వినోద పరిశ్రమ గురించి మాట్లాడిన విక్రాంత్, సినీ నిర్మాణం అత్యంత వ్యయంతో కూడుకున్న వ్యవహారమని వ్యాఖ్యానించారు. షూటింగ్‌లో 12 గంటల షిఫ్ట్ ఉన్నప్పటికీ, నిజానికి కేవలం నాలుగు లేదా ఐదు గంటలు మాత్రమే కెమెరా ముందు పనిచేస్తామని వివరించారు. బడ్జెట్ పరిమితులు, ప్రాక్టికల్ పరిస్థితుల కారణంగా కొన్నిసార్లు 16 నుంచి 17 గంటలు కూడా పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. రుచిర్ అరుణ్ దర్శకత్వంలో మహిమా మక్వానా, వేదిక పింటోలతో కలిసి విక్రాంత్ నటించిన ప్రేమకథా చిత్రం 'ముసాఫిర్ కేఫ్' జులై 24న నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదల కానుంది. ఇందులో చందర్ పాత్రలో తన నటన కొత్త భావోద్వేగాలను ఆవిష్కరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# విజయ్ 'జన నాయగన్'పై అనిల్ రావిపూడి ఆసక్తికర వ్యాఖ్యలు

తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ నటించిన పొలిటికల్ డ్రామా 'జన నాయగన్' చిత్రంపై టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తెలుగు, తమిళ సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ సినిమాపై ఆయన తన అభిప్రాయాలను పంచుకోవడంతో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు దీనిపై జోరుగా చర్చిస్తున్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ, 'జన నాయగన్' చిత్రంపై తనకున్న అంచనాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలు ప్రేక్షకుల్లో తీవ్ర కుతూహలాన్ని పెంచుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. విజయ్ సినిమాపై మరో పరిశ్రమకు చెందిన ప్రముఖ దర్శకుడు ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. నందమూరి బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'భగవంత్ కేసరి' చిత్రమే ఈ సినిమాకు స్ఫూర్తి అని దర్శకుడు హెచ్. వినోద్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన అనిల్ రావిపూడి భగవంత్ కేసరిలోని కొన్ని సన్నివేశాలను మాత్రమే 'జన నాయగన్' కోసం తీసుకున్నారని స్పష్టం చేశారు. విజయ్ స్టార్‌డమ్‌కు తగిన రీతిలో దర్శకుడు వినోద్ ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించారని ఆయన కొనియాడారు.






# నన్ను అపార్థం చేసుకున్నారు

## నాకెలాంటి సర్జరీ జరగలేదన్న బిగ్‌బి



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇటీవల చేసిన సోషల్ మీడియా పోస్ట్ దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స, ఐసీయూ, కోలుకునే పక్రియ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలతో అమితాబ్‌కు సర్జరీ జరిగిందని అభిమానులు భావించారు. అయితే ఈ ప్రచారాలపై తాజాగా ఆయన స్వయంగా స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. బిగ్ బీ తన బ్లాగ్‌లో శస్త్రచికిత్స అనంతరం కోలుకోవడం ఎంత కష్టమో వివరిస్తూ ఓ పోస్ట్ చేశారు. దీంతో ఆయన ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందారని, సర్జరీ చేయించుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆ పోస్టు వెనుక అసలు ఉద్దేశాన్ని అమితాబ్ వివరించారు. నాకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదు. నేను పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నాను. నా పోస్ట్‌ను చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు అని ఆయన స్పష్టం చేశారు. శస్త్రచికిత్స తర్వాత ఐసీయూ నుంచి ఇంటికి వచ్చిన వ్యక్తి ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులను కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే ప్రస్తావించానని చెప్పారు. ఇటీవల జరిగిన అర్జెంటీనా?స్పెయిన్ ఫిఫా మ్యాచ్‌ను ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని అమితాబ్ వెల్లడించారు. ఒక ఛాంపియన్ ఓడిపోయిన తర్వాత తిరిగి నిలబడటం ఎంత కష్టమో చెప్పాలనుకున్నాను. ఫిఫా ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓడిన తర్వాత మెస్సి పరిస్థితిని ఊహించుకుని ఆ పోస్ట్ రాశాను. కానీ, అది నా ఆరోగ్యానికి సంబంధించినదిగా అందరూ భావించారు అని వివరించారు. అమితాబ్ ఇచ్చిన ఈ వివరణతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు.